బ్రోచర్‌ను విడుదల చేస్తున్న సిపిఎం, సిపిఐ , రాజ్యాంగ హక్కుల వేదిక నాయకులు

ఆసక్తిగా ఆలూరు రాజకీయం

- మూడు సార్లు ఎమ్మెల్యేగా ఈరన్న - రెండు సార్లు గుమ్మనూరు, మారెప్ప విజయం

ఆలూరు నియోజకవర్గ రాజకీయ ఆసక్తిగా మారింది. అధికార వైసిపి ప్రస్తుత మంత్రి గుమ్మనూరును తప్పించి ఆ స్థానంలో చిప్పగిరి జడ్‌పిటిసి విరూపాక్షిని నియోజకవర్గ సమన్వయకర్తగా నియమించింది. టిడిపి మాత్రం ఇంకా అభ్యర్థిని ఖరారు చేయలేదు. వెనుకబడిన ఆలూరు నియోజకవర్గ సమస్యలను అధికార ప్రతిపక్షపార్టీలు నిర్ధిష్టంగా పట్టించుకోవడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. ఎన్నికల హామీలు ఏమయ్యాయని ,సాగు, తాగునీరు, వలసల నివారణకు పాలకులు సరయిన చర్యలు తీసుకో లేదని అంటున్నారు. ఈసారి టిడిపి నుంచి బిసిలకు టికెక్ కావాలని గట్టిగా ప్రయత్నిస్తున్నారు. ఈనేపథ్యంలో ఆలూరు రాజకీయం ఆసక్తిగా మారనుంది.

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

పునర్విభజనకు ముందున్న ఆలూరు, హోళగుంద, హాలహర్వి, చిప్పగిరి మండలాలు ఆలూరు నియోజకవర్గంలోనే కొనసాగుతున్నాయి. ఆస్పరి మండలానికి చెందిన 12 గ్రామాలు గతంలో ఈ నియోజకవర్గంలో ఉండేవి. 8 గ్రామాలు పత్తికొండ నియోజకవర్గంలో ఉండేవి. పునర్విభజనలో ఆస్పరి మండలం మొత్తాన్ని ఆలూరు నియోజకవర్గంలో చేర్చారు. గతంలో దేవనకొండ మండలానికి చెందిన 6 గ్రామాలు పత్తికొండ నియోజకవర్గంలో, 9 గ్రామాలు డోన్ నియోజకవర్గంలో ఉండేవి. పునర్విభజనలో దేవనకొండ మండలం మొత్తాన్ని ఆలూరు నియోజకవర్గంలో కలిపారు. నియోజకవర్గాల పునర్విభజన తరువాత ఆలూరు నియోజకవర్గం జనరల్‌గా మారింది. తాజా లెక్కల ప్రకారం ఆలూరు నియోజకవర్గంలో 2,53,927 మంది ఓటర్లు ఉన్నారు. వారిలో 1,27,600 మంది పురుషులు, 1,26,273 మంది మహిళా ఓటర్లు, 54 మంది థర్డ్ జెండర్ ఓటర్లు ఉన్నారు. ఆలూరు నియోజకవర్గం ప్రస్తుతం కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం ఇలాఖాగా ఉంది. అధికార వైసిపి ఈ ఎన్నికల కోసం గుమ్మనూరును తప్పించి ఆ స్థానంలో చిప్పగిరి జడ్‌పిటిసి విరూపాక్షిని నియోజకవర్గ సమన్వయకర్తగా నియమించింది. ప్రతిపక్ష టిడిపి మాత్రం ఇప్పటి వరకూ అభ్యర్థిని ఖరారు చేయలేదు. ప్రస్తుతం నియోజకవర్గ సమన్వయకర్తగా కోట్ల సుజాతమ్మ ఉన్నారు. టిడిపి తరపున దాదాపు ఆమెకే టికెట్ ఖరారైందని ప్రచారం జరుగుతోంది. అయితే టికెట్ ఆశిస్తున్న ఆశావహులు కూడా ఎక్కువ సంఖ్యలోనే ఉన్నారు. మొత్తంగా ఆలూరులో 2024 ఎన్నికల్లో టిడిపి, వైసిపి మధ్య ప్రధాన పోరు సాగనుంది. ఎన్నికల బరిలో కాంగ్రెస్‌తో పాటు పలువురు స్వతంత్ర అభ్యర్థులు కూడా నిలిచే అవకాశం ఉంది.

2019 ఎన్నికల్లో టిడిపి అభ్యర్థి కోట్ల సుజాతమ్మపై వైసిపి అభ్యర్థి గుమ్మనూరు జయరాం 39,896 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. దాంతో ఆయనకు రాష్ట్ర మంత్రివర్గంలో చోటు దక్కింది. కార్మిక శాఖ మంత్రిగా కొనసాగుతున్నారు. 2014 ఎన్నికల్లోనూ టిడిపి అభ్యర్థి బి.వీరభద్రగౌడ్‌పై గుమ్మనూరు జయరాం 1,919 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. 2009 ఎన్నికల్లో ప్రజారాజ్యం పార్టీ తరపున పోటీ చేసిన గుమ్మనూరు జయరాం ఓటమిపాలయ్యారు. కాంగ్రెస్ అభ్యర్థి నీరజారెడ్డి 37,277 ఓట్లతో గెలుపొందారు. ఈమె అంతకు ముందు పత్తికొండలో పోటీ చేసి ఓడిపోయారు. ఈమె మాజీ ఎమ్మెల్యే శేషిరెడ్డి భార్య. శేషిరెడ్డిని ప్రత్యర్థులు హతమార్చారు. మహాకూటమిలో భాగంగా సిపిఐ తరపున పోటీ చేసిన మాజీ ఎమ్మెల్యే కె.రామకృష్ణ మూడో స్థానానికి పరిమిత మయ్యారు. ఆలూరు నియోజకవర్గానికి 15 సార్లు ఎన్నికలు జరిగితే కాంగ్రెస్, కాంగ్రెస్.ఐ కలిసి తొమ్మిది సార్లు, టిడిపి మూడు సార్లు, వైసిపి రెండు సార్లు, ఒక సారి స్వతంత్రులు గెలిచారు. ఆలూరు నుంచి మసాల ఈరన్న మూడుసార్లు గెలిచారు. ఆయన జిల్లా పరిషత్ ఛైర్మన్‌గా కూడా బాధ్యతలు నిర్వహించారు. ఆలూరులో ఒక సారి గెలిచిన రాజారత్నరావు కోడు మూరులో మరో సారి గెలుపొందారు. 1962లో ఇక్కడ నుంచి లక్ష్మీకాంతరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆలూరు నుంచి రెండు సార్లు గెలిచిన మూలింటి మారెప్ప వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మంత్రివర్గంలో సభ్యునిగా పనిచేశారు. అయితే ఒక జడ్‌పిటిసి ఎన్నికల్లో కాంగ్రెస్ ఓడిపోయినందుకు గాను ఆయన మంత్రి పదవికి రాజీనామా చేయాల్సి వచ్చింది. ఆ తరువాత ఆలూరు సీటు జనరల్‌గా మారడంతో మారెప్పకు టికెట్ దక్కలేదు. ఇక్కడ ఒక సారి గెలిచిన హెచ్.రామలింగారెడ్డి ఆదోనిలో మరో సారి గెలుపొందారు.

గుమ్మనూరు జయరాం వైసిపిలో ఉంటారా లేదా అనే చర్చ నడుస్తోంది. బిసిలకు టిడిపి టికెట్ కావాలని పలువురు ప్రయత్నిస్తున్న నేపథ్యంలో కోట్ల సుజాతకు టికెట్ వస్తుందా లేదా అనే చర్చ కూడా సాగుతోంది. జనసేన పెద్దగా ప్రభావం చూపకపోయినా టిడిపి తీసుకునే నిర్ణయాన్ని బట్టి రాజకీయ పరిణామాలు మారే అవకాశం ఉంది. రాజ్యసభ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర రాజకీయం గుమ్మనంగా , స్తబ్ధతగా ఉంది.

రాజ్యాంగ రక్షణ, ప్రజాస్వామ్య సాధనకు

17న ప్రాంతీయ సదస్సు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

రాజ్యాంగాన్ని రక్షించుకుందాం ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుందాం. బిజెపిని దానికి మద్దతు నిస్తున్న పార్టీలను ఓడిద్దాం అనే లక్ష్యంతో భారత రాజ్యాంగ హక్కుల పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో ఫిబ్రవరి 17న కర్నూల్ నగరంలోని సి.క్యాంపులో ఉన్న లలిత కళా సమితి లో జరిగే ప్రాంతీయ సదస్సును జయప్రదం చేయాలని సిపిఎం, సిపిఐ జిల్లా కార్యదర్శులు డి గౌస్ దేశాయి, బి గిడ్డయ్య పిలుపునిచ్చారు. మంగళవారం నగరంలోని పాత కంట్రోల్ రూమ్ వద్ద ఉన్న ఎస్‌టియు జిల్లా కార్యాలయంలో భారత రాజ్యాంగ హక్కుల పరిరక్షణ వేదిక కర్నూలు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ప్రెస్ మీట్ నిర్వహించారు. సిపిఎం, సిపిఐ జిల్లా కార్యదర్శులు డి.గౌస్ దేశాయి, బి.గిడ్డయ్య, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు బతకన్న, భారత రాజ్యాంగ హక్కుల పరిరక్షణ వేదిక జిల్లా నాయకులు కె.కుమార్ మాట్లాడారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత భారత రాజ్యాంగ హక్కులను కాలరాస్తూ, మౌలిక సూత్రాలైన ప్రజాస్వామ్యం, ఫెడరలిజం, లౌకిక తత్వాన్ని, ప్రాథమిక హక్కులను మంట కలుపుతున్నదన్నారు. పాలకులు ప్రజలను మానసిక బలహీనులను చేసి మతం పేరుతో ఆడుకుంటూ.. ప్రజలను సమస్యల కూపంలో నెట్టి, దేశ సంపదను అంబానీ, ఆదానీలకు కట్టబెడుతున్నారని విమర్శించారు. దేశంలో క్రైస్తవులు, మైనారిటీలు, దళితులు, మేధావులు, జర్నలిస్టులు, మహిళలపై మతోన్మాద మూకలు మూకుమ్మడిగా దాడులు, హత్యలు, చేస్తున్నా చూసి చూడనట్లు వ్యవహరిస్తోందని విమర్శించారు. దేశంలో ఫెడరల్ వ్యవస్థను సైతం బద్దలు కొడుతూ సంకుచిత పరిపాలన కొనసాగిస్తోందన్నారు. మొన్న ప్రవేశపెట్టిన బడ్జెట్లో దక్షిణాది రాష్ట్రాల పైన సవతి తల్లి ప్రేమను చూపిందన్నారు. రాష్ట్ర ప్రయోజనాలను ఏమాత్రం పట్టించుకోకపోయినా, రాష్ట్రంలో ఉన్న వైసిపి, టిడిపి, జనసేనలు తమ వ్యక్తిగత ప్రయోజనాల కోసం బిజెపి సంకలో కూర్చున్నాయన్నారు. నియంతృత్వ ఫాసిస్టు పాలనను కొనసాగిస్తున్న బిజెపితో పాటు, రాజ్యాంగ హక్కులను కాల రాస్తున్నా.. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నా.. చూడకుండా గుడ్డిగా బిజెపికి మద్దతు ఇస్తున్న వైసిపి, టిడిపి, జనసేనలను ఓడించాలనే లక్ష్యంతో ప్రజాస్వామ్య శక్తులన్నీ ఐక్యంగా ఫిబ్రవరి 17న ప్రాంతీయ సదస్సును కర్నూల్లో నిర్వహిస్తున్నామని తెలిపారు. సదస్సుకు సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి గోపాల గౌడ, సుప్రీంకోర్టు ప్రముఖ న్యాయవాది ప్రశాంత్ భూషణ్, ప్రముఖ రాజ్యాంగ విశ్లేషకులు పైసల్ ఖాన్, భారత రాజ్యాంగ హక్కుల పరిరక్షణ వేదిక రాష్ట్ర కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వర రావు, కో కన్వీనర్ విజయ రావు, సిపిఎం, సిపిఐ రాష్ట్ర కార్యదర్శులు వి.శ్రీనివాసరావు, కె.రామకష్ణ, జై భారత్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు జెడి. లక్ష్మీనారాయణ, ప్రత్యేక హోదా విభజన హామీల సాధన సమితి కన్వీనర్ చలసాని శ్రీనివాసరావు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు తులసిరెడ్డి, కర్నూలు మాజీ ఎమ్మెల్యే ఎం.ఏ గఫూర్, ఏపీ ఎస్సీ ఎస్టీ లాయర్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు వై. జయరాజు ముఖ్య అతిథులుగా హాజరవుతున్నారన్నారు. సదస్సుకు ప్రజలు అత్యధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలన్నారు. భారత రాజ్యాంగ హక్కుల పరిరక్షణ వేదిక జిల్లా నాయకులు ఎండి. ఆనంద్ బాబు, సిపిఐ జిల్లా నాయకులు జగన్నాథం, ఎస్ఎన్. రసూల్, ఎస్ మునెప్ప, నగర కార్యదర్శి రామకష్ణారెడ్డి, నాయకులు శ్రీనివాసులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి పర్యటనకు ఏర్పాట్లు ముమ్మరం

- 700 మంది పోలీసులతో భారీ బందోబస్తు
- భద్రత ఏర్పాట్లు పరిశీలించిన డిఐజి,ఎస్పి

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

ఈనెల15న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్ రెడ్డి కర్నూలు రాక సందర్భంగా భద్రత పరంగా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కర్నూలు రేంజ్ డిఐజి సిహెచ్. విజయరావు, జిల్లా ఎస్పి. జి.కృష్ణకాంత్ పర్యటన ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు సూచించారు. ఎమ్మిగనూరు ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి మనవడు పవన్ కళ్యాణ్‌రెడ్డి వివాహానికి ముఖ్యమంత్రి హాజరు అవుతున్నందున కర్నూలు బళ్ళారి రోడ్డులోని కింగ్ ప్యాలెస్ గ్రాండ్ కన్వెన్షన్ పరిసరాలను , ఓర్వకల్లు ఏయిర్ పోర్టులో భద్రతా పరంగా పర్యటన ఏర్పాట్లను పరిశీలించారు. ఈ బందోబస్తు విధులలో అడిషనల్ ఎస్పి ఒకరు , నలుగురు డిఎస్‌పిలు, 16 మంది సిఐలు, 17 మంది ఎస్ఐలు, 63 మంది ఎఎస్ఐలు , హెడ్ కానిస్టేబుళ్ళు, 130 మంది కానిస్టేబుళ్ళు, 18 మంది మహిళా పోలీసులు, 70 మంది హోంగార్డులు , ఇతర జిల్లాల నుండి అడిషనల్ ఎస్‌పి ఒకరు, ఐదుగురు డిఎస్‌పిలు, 9 మంది సిఐలు, 30 మంది ఎస్ఐలు, 50 మంది ఎఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్ళు, 110 మంది కానిస్టేబుళ్ళు, 18 మంది మహిళా పోలీసులు, 50 మంది హోంగారులు , 3 స్పెషల్ పార్టీలు, 97 మంది ఎఆర్ పోలీసులు బందోబస్తు విధులలో పాల్గొంటారు. హెలిప్యాడ్ , వాహనాల పార్కింగ్, తదితర ఏర్పాట్లకు సంబంధించి సమన్వయంతో పని చేయాలని, ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. ముఖ్యమంత్రి వచ్చే ముఖ్యమైన రహదారులను, రూట్ బందోబస్తులను పరిశీలించారు. పోలీసు అధికారులకు సిబ్బందికి తగిన సూచనలు, సలహాలను చేశారు. కర్నూలు మున్సిపల్ కమిషనర్ భార్గవ తేజ, అడిషనల్ ఎస్‌పి అడ్మిన్ నాగరాజు, కర్నూలు సబ్ డివిజన్ డిఎస్‌పి విజయ శేఖర్, ట్రైనీ డిఎస్‌పి భావన, సిఐలు నాగరాజు యాదవ్, శ్రీనివాస రెడ్డి, శంకరయ్య , ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఏర్పాట్లను పరిశీలిస్తున్న పోలీసు అధికారులు

పరిశ్రమల ప్రోత్సాహం కింద రూ.1.18 కోట్లు

- పిఎం విశ్వకర్మ దరఖాస్తుల పరిశీలన చేపట్టాలి - కలెక్టర్ డాక్టర్ సృజన

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

జిల్లాలో పరిశ్రమల ప్రోత్సాహం కింద 26 క్లెయిమ్‌లకు రూ.1.18 కోట్ల సబ్సిడీ నిధుల విడుదలకు జిల్లా పరిశ్రమల ప్రోత్సాహక కమిటీ ఆమోదముద్ర వేసింది. మంగళవారం కలెక్టర్ డాక్టర్ జి.సృజన అధ్యక్షతన జిల్లా పరిశ్రమల ప్రోత్సాహక కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని సాంప్రదాయ కుల వృత్తిదారులు, హస్తకళకు సంబంధించి ఉమ్మడి జిల్లాల నుంచి 1,46,284 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. వాటిని త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సింగిల్ డెస్క్ పోర్టల్ (2023-24) ద్వారా 158 దరఖాస్తులు వచ్చాయని, వాటిలో 149 దరఖాస్తులను గడువులోపే పరిష్కరించినట్లు తెలిపారు. ప్రధానమంత్రి ఉపాధి కల్పన కార్యక్రమం ద్వారా 2023-24వ సంవత్సరంలో 129 (జనరల్-21, ఎస్సీ-34, ఎస్టీ-03, ఓబీసీ-71) దరఖాస్తులు ఆమోదించినట్లు చెప్పారు. అదే విధంగా ఖాదీ, గ్రామ పరిశ్రమల బోర్డు ద్వారా 58 (జనరల్-18, ఎస్సీ-27, ఎస్టీ-02, ఓబీసీ-11) దరఖాస్తులు రాగా ఆమోదించినట్లు తెలిపారు. పరిశ్రమల జిఎం ఎన్ఎస్ఆర్‌సిఎం.ప్రసాద్, ఎపిఐఐసి జడ్ఎం సోమశేఖర్ రెడ్డి, డిఆర్‌డిఎ పీడీ సలీం బాషా, డిపిఒ నాగరాజు నాయుడు, సాంఘిక సంక్షేమ శాఖ జెడి రంగాలక్ష్మిదేవి, జిల్లా వ్యవసాయ అధికారి వరలక్ష్మి, చేనేత సహాయ సంచాలకులు హరిప్రసాద్, కాలుష్య నియంత్రణ అధికారి మునిప్రసాద్, ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్ ఐ.విజయ్ కుమార్ రెడ్డి, ఐలా ఛైర్మన్ రామకృష్ణా రెడ్డి, ఎస్సీ, ఎస్టీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్ రాజమహేంద్రనాథ్, పిఎం విశ్వకర్మ కమిటీ సభ్యులు నరసింహా వర్మ, కాశీ విశ్వనాథ్, మల్లేశ్వర రావు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ సృజన

రైతులను ఆదుకోవడంలో బిజెపి విఫలం

-16న తలపెట్టిన గ్రామీణ బంద్‌కు సిపిఐ సంపూర్ణ మద్దతు
- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

ప్రజాశక్తి-పత్తికొండ

రైతాంగాన్ని ఆదుకోవడంలో బిజెపి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ విమర్శించారు. మంగళవారం పత్తికొండలో సిపిఐ రాష్ట్రకార్యదర్శి వర్గ సభ్యులు పి. రామచంద్రయ్య, సిపిఐ పత్తికొండ మండల కార్యదర్శి డి రాజా సాహెబ్‌తో కలిసి విలేకరుల సమావేశం మాట్లాడారు. మోడీ ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమయ్యారన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను అంబానీ, ఆదానీలకు అప్పనంగా అప్పగిస్తూ కార్పోరేట్ శక్తులకు ఊడిగం చేస్తున్నారన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలన్నారు. పంట పెట్టుబడికి రైతులు తీసుకున్న బ్యాంకు రుణాలను పూర్తిగా మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. డాక్టర్ స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేయాలన్నారు. సిఎం జగన్ పాలనలో రాష్ట్ర అభివృద్ధి కుంటుపడిందన్నారు. జగన్మోహన్ రెడ్డి 175 అసెంబ్లీ నియోజకవర్గాలలో వైసిపి గెలుస్తుందని ప్రగల్భాలు పలుకుతూ మంత్రులు, ఎమ్మెల్యేలు, పోటీచేసే అసెంబ్లీ నియోజకవర్గ, పార్లమెంట్ స్థానాలను మార్పులు చేయడాన్ని తప్పుపట్టారు. మోడీ, జగన్ మోహన్ రెడ్డి దురహంకార పాలనకు చరమగీతం పాడాలన్నారు. కేంద్ర కార్మిక సంఘాలు, సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ఈనెల 16న తలపెట్టిన గ్రామీణ బంద్‌కు సిపిఐ సంపూర్ణ సహకారం అందిస్తుందని, గ్రామీణ రైతులు, వ్యవసాయ కూలీలు, పట్టణ కార్మిక, కర్షకులు, మహిళలు, విద్యార్థి, యువజన సంఘాలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులతో ఎజిఎం మురళీకృష్ణ, డీన్ బాలజీ

జెఇఇ మెయిన్స్‌లో శ్రీచైన్య విద్యార్థుల ప్రభంజనం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

జెయియి మెయిన్స్ 2024 జనవరి మొదటి సెషన్ ఫలితాలలో కర్నూలు శ్రీచైతన్య కళాశాల విద్యార్థి ప్రప్రథమంగా 100 కి 100 పర్సెంటైల్తో కొత్త ఒరవడిని సృష్టించారని తెలియ చేయడానికి సంతోషిస్తున్నట్లు శ్రీ చైతన్య కళాశాలల ఎజిఎం మురళీకృష్ణ, డీన్ సరళ , డీన్ బాలాజీ , విద్యార్థుల అభినందన సభలో తెలిపారు. తమ విద్యార్థి పి. ప్రణీత్ రెడ్డి ఫిజిక్స్ విభాగంలో100 కు 100 పర్సెంటైల్ తో అసాధారణ ప్రతిభ కనబరిచాడని, 300 మార్కులకు 250 మార్కుల తో 99.77 పర్సెంటైల్, పి. ఉమా లికేశ్ 98.75 పర్సెంటైల్, ఐ.కిరీటి కీర్తన్ 98.65 పర్సెంటైల్, డి.నోయల్ 97.58 పర్సెంటైల్ లాంటి అనేక ఉత్తమ పర్సెంటైల్స్ సాధించారని తెలిపారు. ఈ ఫలితాలు కేవలం కర్నూలు శ్రీ చైతన్య నుండి మాత్రమేనని వేరొక ప్రాంత ఫలితాలు కావని ఎజిఎం మురళీకృష్ణ తెలిపారు. కళాశాలలో జరిగిన అభినందన సభలో ఈ ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తూ రాబోయే జెయియి మెయిన్స్ ఫేజ్ 2 లో మిక్కిలి మెరుగైన ప్రతిభను అనేక మంది విద్యార్థులు సాధిస్తారని, సాధించగలగటానికి కావలసిన తర్ఫీదును విద్యార్థులకు అందజేస్తున్నామన్నారు. ఇదే విధమైన విజయ పరంపరను భవిష్యత్తులో కూడా కొనసాగిస్తామనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

పలుకుదొడ్డిలో మిడ్ డే మీల్స్ తనిఖీ

ప్రజాశక్తి-సి బెళగల్

సి బెళగల్ మండలం పలుకుదొడ్డిలో ఎంపిడిఒ శకుంతల మంగళవారం ఎంపిపి స్కూల్‌లో మిడ్ డే మీల్స్ ను తనిఖీ చేశారు. వంట గదిని, పాఠశాల ఆవరణం చుట్టూ పరిశుభ్రంగా ఉ ంచుకోవాలని ఆమె వంట నిర్వాహకులకు సూచించారు. మెనూను తప్పనిసరిగా పాటించాలని హెచ్ ఎం. హనుమంతు పేర్కొన్నారు. అనంతరం వాలంటీర్లతో సమీక్షించి పనితీరు భేష్ గా ఉండాలన్నారు.

16న బంద్ జయప్రదానికి ప్రచార జాతా ప్రారంభం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ఈనెల 16న నిర్వహించే బంద్‌ను జయప్రదం చేయాలని రవాణా రంగ పరిరక్షణ జీపు జాతా కర్నూలు బళ్లారి చౌరస్తా నుంచి సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్. రాధాకృష్ణ ప్రారంభించారు. వివిధ రంగాల డ్రైవర్లను జైలు శిక్షలు భారీ జరిమానాలు అమలు చేసే భారత న్యాయ సంహిత 2023 చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం రాష్ట్రపతి ఆమోదం పొంది 106 (1)-(2) చట్టాన్ని అమలు చేసిన కేంద్ర ప్రభుత్వం తక్షణమే చట్టాన్ని రద్దు చేయాలన్నారు. ఈనెల 16న జరిగే దేశ వ్యాప్తంగా జరిగే రవాణా రంగ సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. పిఎస్ రాధాకృష్ణ, సిఐటియు న్యూ సిటీ అధ్యక్షులు ఆర్. నరసింహులు, ఆటో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్ మాట్లాడుతూ భారత శిక్షా స్మృతి 1860 చట్టం ప్రకారం డ్రైవర్ తప్పిదం చేస్తే సెక్షన్304-ఎ ప్రకారం రూ.1500 జరిమానా, రెండు సంవత్సరాలు జైలు శిక్షలు విధించేవారన్నారు. ఈ శిక్షలు సరిపోవు అన్నట్లు ఇప్పుడు హిట్ అండ్ రన్ పేరుతో కొత్త చట్టాలను తీసుకొచ్చి డ్రైవర్ల మెడకు ఉరితాడు బిగించడం సరైనది కాదని వారన్నారు. దేశానికి ప్రజలకు అనేక సేవలు చేస్తున్న రవాణా రంగ డ్రైవర్ల పట్ల ప్రభుత్వం చిన్న చూపు తగదన్నారు. ఏ చిన్న తప్పు చేసిన పది సంవత్సరాలు జైలు శిక్ష, రూ.పది లక్షల జరిమానా విధించడం కార్మికుల పట్ల ప్రభుత్వానికి ఉన్న ప్రేమ అర్థమవుతుందన్నారు. ఆటోమొబైల్ రంగ నగర అధ్యక్ష ,కార్యదర్శులు గోవిందు, హైదర్, ఆటో యూనియన్ జిల్లా కార్యదర్శి ఎస్ .హుస్సేన్‌వలి, నగర నాయకులు మళ్లీ, షంషీర్ బాష, నబి, చిన్న వ్యాపారస్తుల సంఘం నగర కార్యదర్శి మహమ్మద్ రఫీ, ఆటో యూనియన్ నాయకులు మధు, వెంకటేశ్వర్లు, రాజేష్, నాగరాజు పాల్గొన్నారు.

కర్నూలులో ప్రచారజాతానుద్దేశించి మాట్లాడుతున్న పిఎస్.రాధాకృష్ణ

గూడూరులో మాట్లాడుతున్న జె.మోహన్

గూడూరు : ఈనెల 16న జరిగే దేశవ్యాప్త భాగంలో ఆటోల బందును జయప్రదం చేయాలని గూడూరు బస్టాండ్‌లో ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ కమిటీ ఆధ్వర్యంలో ప్రచార జీపు జాతా కార్యక్రమం చేపట్టారు. ఎపి ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్,సిఐటియు డివిజన్ కార్యదర్శి జయ మోహన్, వీరన్న మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల ఉపాధ్యక్షులు కె.రాజశేఖర్, ఆటో వర్కర్ యూనియన్ జిల్లా నాయకులు వలి, మళ్లీ, గూడూరు మండల నాయకులు రాజు, డాన్సు రమేష్, దుబ్బన్న, బాష, సుందరరాజు , ఆటో కార్మికులు పాల్గొన్నారు.

ప్రభుత్వంతో తాడోపేడో తేల్చుకుంటాం

నేటినుండి ఉద్యమ కార్యాచరణలోకి -ఉద్యోగ ఉపాధ్యాయ ఐకాస నేతలు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఉద్యోగ ఉపాధ్యాయులకు పెన్షనర్లకు చెల్లించాల్సిన ఆర్థిక బకాయిలను వెంటనే విడుదల చేయకపోతే రాష్ట్ర ప్రభుత్వంతో తేల్చుకుంటామని ఎపి ఉద్యోగ ఉపాధ్యాయ ఐకాస జిల్లా నేతలు వెంగల్ రెడ్డి, జవహర్ లాల్, నవీన్ పాటి నాగేశ్వరరావు హెచ్చరించారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకు తమకు చెల్లించాల్సిన బకాయిలను విడుదల చేయకుండా ఆలస్యం చేస్తుందన్నారు. 11వ పిఆర్‌సి బకాయిలను ఇప్పటివరకు చెల్లించలేదన్నారు. ఉద్యోగుల జిపిఎఫ్ ఎపిజిఎల్ఐ లోన్లు వంటి బకాయిలను చెల్లించాలని అనేకసార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లిన స్పందించలేదన్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ సంఘాలతో నిర్వహించిన చర్చల్లో భాగంగా కనీసం తమ డిమాండ్ల పరిష్కారానికి సానుకూలత ప్రకటించకపోవడం దుర్మార్గమన్నారు. ఇలాంటి ప్రభుత్వాన్ని ఉద్యోగ ఉపాధ్యాయులు మద్దతు పలకరన్నారు. సిపిఎస్ విధానాన్ని రద్దుచేసి ఒపిఎస్ విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. బుధవారం నుండి తమ ఉద్యమ కార్యచరణలో భాగంగా నల్ల బ్యాడ్జీలు ధరించి జిల్లా కలెక్టర్, ఆర్‌డిఒ మండల తహసీల్దారులకు వినతి పత్రాలను సమర్పిస్తామన్నారు. 15 నుండి 16వ తేదీ వరకు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేస్తామన్నారు. 17న తాలూకా కేంద్రాల్లో, 20న జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తామన్నారు. ఈనెల 24న చలో విజయవాడ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఐకాస రాష్ట్ర సమితి ఇచ్చిన పిలుపుమేరకు ఆందోళన కార్యక్రమాలను జయప్రదం చేయాలని ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాలను కోరారు. ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాల నేతలు కాశన్న, రవి ప్రకాష్, మద్దిలేటి, బ్రహ్మానందరెడ్డి, వెంకటేష్ నాగరాజు సుబ్బరాయుడు రవికుమార్ గోకారి ,స్మాయిల్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వెంగళరెడ్డి

ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులతో డిజిఎం, డీన్‌లు, అధ్యాపకులు

జెఇఇ మెయిన్‌లో సత్తా చాటిన 'నారాయణ' విద్యార్థులు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరెట్

జెఇఇ మెయిన్ తొలివిడత పరీక్ష ఫలితాలలో మరోసారి కర్నూలు నారాయణ విద్యార్థులు అత్యధికంగా 99.93 పర్సంటైల్ స్కోర్ సాధించి ప్రభంజనం సష్టించారని నారాయణ విద్యా సంస్థల డిజిఎం గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా నారాయణ కళాశాలలో జరిగిన అభినందనసభలో అత్యధిక స్కోర్ సాధించి టాపర్లుగా నిలిచిన విద్యార్థులకు అభినందనలు తెలిపారు. కర్నూలు నారాయణ కళాశాల నుండి అత్యధిక స్కోర్ సాధించిన వారిలో షాహెన్‌అలిఖాన్ 99.93 పర్సంటైల్ సాధించి టాపర్ గా నిలిచింది. బి. వేదవ్యాస్ 99.92, పి.సాకేత్ సాయి మణికంఠ 99.71, ఎస్. సాకేత్ రామ్ 99.62, ఆర్.సాయి అభినయ్ 99.49, ఎమ్. ధనుజ్ సాయి 99.16, టి.సాయి నిఖిల్ రెడ్డి 98.88,ఎమ్. లాస్య 98.54, టి. ప్రణిత 98.35, టి.కె.సౌమ్య శ్రీ 98.30, ఎమ్. హరిక 98.23, జి. సర్వజిత్ 97.74, ఎ.జస్వంత్ 97.74, టి.సువార్త 97.72, బి.శ్రావ్య 97.40, ఎమ్. దినేశ్వర కుమార్ 97.39, బి. గౌతమ్ సాయి 97.24, ఎమ్. సోహిత్ రెడ్డి 97.21, యు. నవ్య శ్రీ 97.11 పర్సంటైల్ సాధించారు. 99 పర్సంటైల్ పైన 6 గురు, 98 పైన 11 మంది, 97 పైన 19 మంది, 96 పైన 26 మంది, 95 పైన 37 మంది, 90 పైన 83 మంది, 80 పైన 189 మంది, 70 పైన 337 మంది విద్యార్థులు అర్హత సాధించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సన్మానించారు. విద్యార్థుల తల్లిదండ్రులు , అధ్యాపక బందాన్ని అభినందిచారు. ఈ కార్యక్రమంలో కళాశాల డిజిఎం టి.గోవర్ధన్ రెడ్డి, డీన్లు ఆంజనేయ రెడ్డి, విశ్వనాథ్ రెడ్డి, నరసింహరావు, ప్రిన్సిపల్ వేణు గోపాల్ రెడ్డి, జయరామి రెడ్డి, సుధాకర్ రెడ్డి, విజయ మోహన్, పి.సుజాత, అధ్యాపకులు ,విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బాలిక కిడ్నాప్ కేసు నిందితుల అరెస్టు

ప్రజాశక్తి-వెల్దుర్తి

వెల్దుర్తి మండలం రామళ్లకోట గ్రామంలో ఈనెల 3న బాలికను కిడ్నాప్ చేశారని బాలిక నాయనమ్మ ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసిన పోలీసులు వారిని మంగళవారం ఉదయం రామళ్లకోటకు చెందిన లింగమయ్య, జయరాముడు, శేఖర్‌లను ఎస్ఐ పి చంద్రశేఖర్ రెడ్డి పోలీస్ సిబ్బందితో కలిసి అరెస్టు చేశారు. అరెస్టు చేసిన నిందితులను రిమాండ్ నిమిత్తం డోన్ కోర్టులో హాజరు పరిచారు. కోర్టు వారికి రిమాండ్ కు విధించిందని ఎస్ఐ పి చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు.

నిందుతులతో ఎస్ చంద్రశేఖర్, సిబ్బంది

ట్రాన్స్‌పోర్ట్ ఆటోడ్రైవర్లపై ప్రమాదకర చట్టాన్ని రద్దు చేయాలి

- 16న రవాణా రంగ సమ్మెను జయప్రదం చేయండి
- సిఐటియు నాయకులు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

బిజెపి ప్రభుత్వం తెచ్చిన ట్రాన్స్‌పోర్ట్ ఆటో డ్రైవర్లపై ప్రమాదకర క్రిమినల్ చట్టాన్ని రద్దు చేయాలని ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ (సిఐటియు) జిల్లా కార్యదర్శి ఆర్.ప్రభాకర్, సిఐటియు తాలూకా అధ్యక్ష, కార్యదర్శులు గోవిందు, బి.రాముడు డిమాండ్ చేశారు. ట్రాన్స్‌పోర్ట్ రంగంలో ప్రమాదకర క్రిమినల్ చట్టాన్ని నిరసిస్తూ మంగళవారం సిఐటియు ఆధ్వర్యంలో జిల్లా జాతా నిర్వహించారు. ఈ జాతా సందర్భంగా పట్టణంలోని సోమప్ప సర్కిల్‌లో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. బిజెపి తెచ్చిన ట్రాన్స్‌పోర్ట్ రంగంలో సెక్షన్ 106 (1)(2) అన్ని రకాల డ్రైవర్లపై క్రిమినల్ చట్టాలను ఉపయోగించడం కార్మికులకు ఉరితాడు వేసే విధంగా ఉందని తెలిపారు. బ్రిటీష్ కాలం నాటి చట్టాల కంటే ఘోరంగా అమలు చేస్తున్నారన్నారు. ఈ చట్టాన్ని వెనుక తీసుకునేంత వరకు సిఐటియు ఆధ్వర్యంలో పోరాటం చేస్తామని హెచ్చరించారు. జిల్లా, తాలూకా నాయకులు హుస్సేన్ వలీ, మల్లి, రాజు, ఆది, బడేసాబ్, రహిమాన్, గాంధీ, సోమేశ్వర్ నాయుడు, ఇజ్రాయిల్, చంద్ర, ఆటో కార్మికులు పాల్గొన్నారు.

ఆస్పరి : రోడ్డు రవాణా బిల్లు పార్లమెంట్‌లో చట్టం తేవడం వల్ల ట్రాన్స్‌పోర్ట్ రంగం తీవ్రంగా నష్టపోయిందని ఆటో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రభాకర్, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి హనుమంతు తెలిపారు. ఆస్పరికి జీపుజాతా చేరుకుంది. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఎన్నో ఏళ్లుగా పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను మార్చి, కార్మిక హక్కులను కాల రాయడం సమంజసం కాదన్నారు. ప్రమాదాలకు అసలు కారణాలు పరిశీలించి సమస్యను పరిష్కరించాలని తెలిపారు. ప్రజలకు రహదారి భద్రత నియమాల పట్ల అవగాహన కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ఈ నెల 16న జరిగే రోడ్డు రవాణా సార్వత్రిక సమ్మెలో ఆటో కార్మికులు, లారీ కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సిఐటియు మండల కార్యదర్శి రామాంజనేయులు, రైతుసంఘం మండల కార్యదర్శి రంగస్వామి, బాలకృష్ణ, ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి రవి, ఆటో యూనియన్ నాయకులు బలరాం, రమేష్, డివైఎఫ్ఐ నాయకులు నరేంద్ర, మల్లి, ఈరన్న, రామాంజనేయులు, శివ పాల్గొన్నారు.

ఎమ్మిగనూరులో మాట్లాడుతున్న ప్రభాకర్

ఆస్పరిలో మాట్లాడుతున్న ప్రభాకర్

కరువు పరిహారమివ్వాలి

- వామపక్ష నాయకులు
- మండల సర్వసభ్య సమావేశంలో బైఠాయింపు

ప్రజాశక్తి- దేవనకొండ

ఈఏడాది నెలకొన్న తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో మండల రైతులకు చెందిన ఖరీఫ్, రబీ సీజన్‌లో పంటలు దారుణంగా దెబ్బతిన్నాయని, రైతులకు కరువు పరిహారమివ్వాలని వామపక్ష నాయకులు డిమాండ్ చేశారు. ప్రభుత్వం కరువు ప్రకటించి చేతులు దులుపుకుంటుందని, రైతులకు పరిహారం ఇవ్వడం లేదని మంగళవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో వామపక్ష నాయకులు బైఠాయించారు. పంట నష్ట పరిహారం ఇచ్చి రైతులను ఆదుకోవాలని సిపిఎం జిల్లా నాయకులు వీరశేఖర్, సిపిఐ మండల కార్యదర్శి నరసరావు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు రైతుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. వరుసగా కరువులు వస్తున్నా ఆదుకునే నాథుడు లేదని తెలిపారు. కరువు ప్రకటించడం, చేతులు దులుపుకోవడం ప్రభుత్వానికి పరిపాటిగా మారిందని విమర్శించారు. వేలకు వేల రూపాయలు పెట్టి భారీగా నష్టం చవిచూస్తున్న రైతును విస్మరిస్తున్నారని తెలిపారు. రైతు రోజురోజుకూ అప్పుల్లో కూరుకుపోతూ ప్రాణాలను పణంగా పెడుతున్నా ప్రభుత్వానికి, ప్రజాప్రతినిధులకు కనికరం రావడం లేదని విమర్శించారు. కరువు ప్రకటించిన ప్రభుత్వం ఇప్పటివరకు పరిహారం ఇవ్వకుండా రైతుల పట్ల నిర్లక్ష్యం వహిస్తోందని మండిపడ్డారు. ఎన్నికల కోడ్ వస్తే పరిహారం వచ్చే అవకాశం చాలా తక్కువని, ఇప్పటికే 2018 సంవత్సరంలో ఇలాంటి అనుభవం ఉందని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం రైతు ఖాతాల్లో పంట నష్టపరిహారం జమ చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ప్రజా ప్రతినిధులు కూడా రైతుల తరపున మాట్లాడాలని కోరారు. పంట నష్టపరిహారం, ఉపాధి కల్పన, వలసల నివారణ, పశుగ్రాసం తదితర అంశాల్లో రైతులకు అండగా నిలవాలని తెలిపారు. మండలంలో సీజనల్ హాస్టల్ లేకపోవడంతో చాలా మంది విద్యార్థులు చదువుకు దూరమయ్యారని, ఆ పాపం ప్రభుత్వానిదేనని విమర్శించారు. ఈ బైఠాయింపు కార్యక్రమానికి టిడిపి ప్రజాప్రతినిధులు విజయ భాస్కర్ గౌడ్, భాస్కర్, నాగరాజు గౌడ్, మహేశ్వర్ రెడ్డి చిన్న రామప్పలు మద్దతు తెలిపారు. వామపక్ష నాయకులు అశోక్, యూసుఫ్ బాష, వెంకటేశులు, రామాంజనేయులు, వీరాంజనేయులు, పాండు పాల్గొన్నారు.

సర్వసభ్య సమావేశంలో బైఠాయించిన వామపక్ష నాయకులు

ఇసుక రీచ్‌లను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

- సబ్ కలెక్టర్ శివ నారాయణ శర్మ

ప్రజాశక్తి - ఆదోని

ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించినా, ఇసుక ర్యాంపులో అధిక లోడ్‌తో ఇసుక లారీలు తరలించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆదోని సబ్ కలెక్టర్ శివ నారాయణ శర్మ హెచ్చరించారు. మంగళవారం ఆదోని డివిజన్‌లోని కౌతాళం మండలం గుడికంబాళి, మరళి గ్రామ నదీ తీర ప్రాంతంలో ఇసుక ర్యాంపులను అధికారులతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇసుక ర్యాంపులో నిల్వ ఉన్న ఇసుక వివరాలను మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్‌తో ఆరా తీశారు. ప్రభుత్వం అనుమతి ఇచ్చిన ప్రదేశం, సమయంలోగా ఇసుకను సేకరించాలని కాంట్రాక్టర్స్‌ను ఆదేశించారు. అవసరమైతే కేసులు నమోదు చేయడానికి ఆదేశాలు ఉన్నాయన్నారు. తహశీల్దార్ అలెగ్జాండర్, రెవెన్యూ సిబ్బంది, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

మిస్సింగ్ కథ సుఖాంతం

ప్రజాశక్తి - ఆదోని

తప్పిపోయిన బాలుని పోలీసులు తల్లిదండ్రులకు అప్పగించడంతో కథ సుఖాంతమైంది. మంగళవారం రైల్వే ఎస్ఐ గోపి తెలిపిన వివరాల మేరకు... ఆదోని రైల్వే స్టేషన్‌లో తప్పిపోయిన బాలుడు సందీప్ గుంతకల్‌లో ఉన్నాడనే సమాచారం అందింది. విచారించగా ఆదోని పట్టణంలోని కోడల్ పేటకు చెందిన వారిగా గుర్తించారు. బాలుని ఆదోనిలోని కౌడల్ పేటకు చెందిన తండ్రి బోయ మురళీకి అప్పగించారు. తప్పిపోయిన బాలుడు ఆచూకీ కనుగొని అప్పగించడంతో తండ్రి, బంధువులు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

బాలుని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న పోలీసులు

క్షయవ్యాధి లక్షణాలు, నివారణపై అవగాహన

ప్రజాశక్తి - ఆదోని

క్షయ వ్యాధి లక్షణాలు, నివారణ, చికిత్స విధానంపై డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ సత్యవతి, ఎంపిహెచ్ఎస్ బాబురాజు అవగాహన కల్పించారు. మంగళవారం ఆదోనిలోని టిబి మ్యాక్ సెంటర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. క్షయవ్యాధి నిర్మూలనకు కలిసికట్టుగా పాటుపడాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ఆర్‌టిపిసిఆర్ వంటి ఆధునిక పరీక్ష విధానంతో క్షయవ్యాధిని తొలిదశలో నిర్ధారించవచ్చని తెలిపారు. సమతుల్య ఆహారం తీసుకోవడం, సమయానికి మందులు వాడడం వల్ల వ్యాధి నుంచి విముక్తి పొందవచ్చన్నారు. క్షేత్ర స్థాయిలో సర్వేలు నిర్వహించి, గళ్ల పరీక్షలతో టిబి వ్యాధిగ్రస్తులను గుర్తించాలని సూచించారు. డాక్టర్లు వినోద్ కుమార్, గాయత్రి, అనిల్ సాగర్, ఎంపిహెచ్ఎస్‌లు లక్ష్మమ్మ, మేరీ, జ్ఞానేశ్వరి, టిబిహెచ్‌విలు మనోరంజినీ దేవి, సుబ్బమ్మ బాయి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డాక్టర్ సత్యవతి

గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయండి

- సిఐటియు, ఎఐటియుసి నాయకులు

ప్రజాశక్తి - మంత్రాలయం

కేంద్ర ప్రభుత్వ నిర్ణయాలకు వ్యతిరేకంగా సిఐటియు ఆధ్వర్యంలో ఈ నెల 16న చేపట్టనున్న దేశవ్యాప్త గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని సిఐటియు నాయకులు, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కె.వెంకటేశులు, ఎఐటియుసి నాయకులు నాయక్ కోరారు. మంగళవారం స్థానికంగా ఏర్పాటు చేసిన ప్రజాసంఘాల రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పదేళ్లు పూర్తయిందని తెలిపారు. రైతు, కార్మిక, ప్రజా సమస్యలను పరిష్కరించకుండా కార్పొరేట్ సంస్థలకు కొమ్ముకాస్తూ మతతత్వ రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తానని హామీ ఇచ్చి విస్మరించారని మండిపడ్డారు. నేడు ఉద్యోగ కల్పన పడిపోయిందని, నిరుద్యోగం 50 ఏళ్ల గరిష్ట స్థాయికి చేరిందని తెలిపారు. శ్రామికుల నిజ వేతనాలు 20 శాతం తగ్గిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. భారత రాజ్యాంగంలో పొందపరచిన లౌకిక వాదాన్ని తారుమారు చేస్తూ హిందూ రాజ్యస్థాపన లక్ష్యంగా ఆర్ఎస్ఎస్ తన జెండాను బిజెపి ద్వారా ముందుకు తీసుకెళ్తోందని తెలిపారు. దేశంలో నిరుద్యోగం, ధరల పెరుగుదల, పేదరికం, ఆకలి తదితర కీలకాంశాల నుంచి దృష్టి మరల్చడానికి కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఎఐటియుసి నాయకులు నాయక్, సిఐటియు నాయకులు ప్రాణేష్, అంజి, దేవారం, నవ్యాంధ్ర ఎంఆర్‌పిఎస్ మంత్రాలయం ఇన్‌ఛార్జ్ దేవిపుత్ర పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రైతుసంఘం జిల్లా అధ్యక్షులు వెంకటేశులు

ప్రజా సమస్యలు పరిష్కారం కానీ సమావేశాలెందుకు..?

- మండల మీట్‌లో ధ్వజమెత్తిన సభ్యులు

ప్రజాశక్తి- దేవనకొండ

మండలంలో నెలకొన్న ప్రజా సమస్యలను పరిష్కరించడంలో అధికారులు, రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని, సమస్యలు పరిష్కారానికి నోచుకోని మండల సర్వసభ్య సమావేశాలు ఎందుకని ఎంపిటిసి సభ్యులు విజయ భాస్కర్ గౌడ్, సర్పంచులు వెలమకూరు భాస్కర్, బేతపల్లి సర్పంచి వెంకటేశ్వర్ రెడ్డి ప్రశ్నించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో ఎంపిపి లక్ష్మీదేవి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. స్థానిక ఎంపిటిసి సభ్యులు తపాల శ్రీనివాసులు నాయుడు మాట్లాడుతూ... దేవనకొండ పంచాయతీ పరిధిలో కూరగాయల మార్కెట్ వేలం పాటలు నిర్వహించకుండా అనధికారికంగా నిర్వహిస్తున్నారని తెలిపారు. పంచాయతీకి రావాల్సిన ఆదాయానికి గండి పడిందని, సంబంధిత శాఖాధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. దేవనకొండ క్రాస్ రోడ్డుకు వెళ్లే మార్గంలో అనధికారికంగా రహదారిని గుంతలమయం చేసి తాగునీటి కుళాయికి పైపులైన్ వేసుకుంటున్నారని తెలిపారు. నియంత్రించాల్సిన అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదని విమర్శించారు. నేలతలమర్రి ఎంపిటిసి సభ్యులు విజయ భాస్కర్ గౌడ్ మాట్లాడుతూ... రైతులను ఆదుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ఎఒ సురేష్ బాబు మాట్లాడుతూ... ఈఏడాది ఖరీఫ్, రబీ సీజన్‌లో వర్షాలు కురవకపోవడంతో రైతులకు పంట నష్టం వాటిల్లిందని తెలిపారు. ఈ మేరకు కరువు పరిహారానికి నివేదికలు సిద్ధం చేసి ప్రతిపాదనలు పంపామన్నారు. ఎంపిపి లక్ష్మీదేవి మాట్లాడుతూ... మండలంలో నెలకొన్న కరువు పరిస్థితులు, సమస్యలపై తీర్మానాలు చేసి ప్రభుత్వం, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. ఇన్‌ఛార్జీ ఎంపిడిఒ ఈద్రూస్, ఇఒఆర్‌డి సూర్యనారాయణ, ఎంఇఒ తిమ్మారెడ్డి, రహదారులు, విద్యుత్, ఆర్‌డబ్ల్యుఎస్, పిఆర్ ఇంజినీర్లు లక్ష్మీ శ్వేత, రవీంద్ర, మురళీ మోహన్, ఉదయ్ కుమార్, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ సునీత పాల్గొన్నారు.

సమావేశంలో అధికారులను ప్రశ్నిస్తున్న ప్రజాప్రతినిధులు

వలకు చిక్కిన చిరుత పులి

- ఊపిరి పీల్చుకున్న గ్రామస్తులు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు రూరల్

మండలంలోని గుడికల్ గ్రామంలో చిరుతపులి వలకు చిక్కింది. దీంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు. వివరాలిలా ఉన్నాయి... గతంలో చిరుతపులి గొర్రెలపై దాడి చేస్తుంటే గొర్రెల కాపరులు అటవీ శాఖాధికారులకు ఫిర్యాదు చేశారు. అటవీ శాఖాధికారులు చిరుత పులి కోసం వలలు ఏర్పాటు చేశారు. గుడికల్ గ్రామ సమీపంలో ఉన్న కొండపై సోమవారం రాత్రి వచ్చి చిరుత పులి వలకు చిక్కింది. గుడికల్లు గ్రామానికి చెందిన గొర్రెల కాపరుల మంద నుంచి 15 గొర్రెలను చనిపోయినట్లు తెలిపారు. వలలో చిక్కుకున్న చిరుత పులిని అడవిలో వదిలేస్తామని అటవీ శాఖాధికారులు శివ శంకర్ రెడ్డి తెలిపారు. గొర్రెల కాపరులు, గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్టాపన

- శివాలయంలో నవగ్రహ విగ్రహాల ప్రతిష్టాపన

ప్రజాశక్తి - హోళగుంద

హోళగుంద మండలం సమ్మతగేరి గ్రామ దేవత సుంకులమ్మ అవ్వ నూతన ఆలయ ప్రారంభోత్సవం, నూతన విగ్రహ ప్రాణ ప్రతిష్టాపన గ్రామ పెద్దల ఆధ్వర్యంలో మంగళవారం వైభవంగా సాగింది. జలాభిషేకం, ధాన్యాభిషేకం, హోమాలు, యజ్ఞాలు, వాస్తు పూజలు, ఇతర పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. జె హోసళ్లి మఠం పీఠాధిపతులు శంభులింగ స్వామి చేతుల మీదుగా విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. శివాలయంలో నవగ్రహాలను ప్రతిష్టించారు. అనంతరం గ్రామస్తులంతా ధూపదీపాధి, నైవేద్యాలు సమర్పించారు.

ప్రతిష్టాపనలో పాల్గొన్న మహిళలు

ఇన్‌పుట్ సబ్సిడీ మంజూరు చేయాలి

- రైతుసంఘం నాయకులు

ప్రజాశక్తి - గోనెగండ్ల

గతేడాది ఖరీఫ్ సీజన్‌లో కరువుతో పంటలు దెబ్బతిన్న రైతులకు ప్రభుత్వం వెంటనే ఇన్‌పుట్ సబ్సిడీని మంజూరు చేయాలని రైతుసంఘం మండల నాయకులు నరసింహులు, కె.గోవిందు కోరారు. మంగళవారం గోనెగండ్ల తహశీల్దార్ కార్యాలయం వద్ద రైతుసంఘం ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్ లక్ష్మీ రాజాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కరువు కారణంగా పంటలు నష్టపోయిన రైతులందరికీ ఎకరాకు రూ.10 వేల ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వాలని కోరారు. పంటలకు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం పంటల బీమా పరిహారం ఎకరాకు రూ.20 వేల నుంచి రూ.50 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కర్నూలు, తుగ్గలి, క్రిష్ణగిరి మండలాలను కరువుగా గుర్తించాలని తెలిపారు. వలసల నివారణకు ఉపాధి పనులు కుటుంబానికి 200 రోజులు కల్పించాలని, రాష్ట్రంలో కరువు, తుఫాన్‌తో నష్టపోయిన రైతులందరినీ ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రూ.2 లక్షల వరకు ఉన్న రైతుల రుణాలు వెంటనే మాఫీ చేయాలని కోరారు. పరమేష్, తిమ్మారెడ్డి, లోకేష్, తిమ్మప్ప, కైరవాడి శ్రీరాములు, పిల్లిగుండ్ల నాగరాజు, ఎంసి.రంగస్వామి, బొంబాయి రాముడు, జనార్ధన్ రెడ్డి, హనుమంతు రెడ్డి, చిన్న సోమన్న, రంగన్న పాల్గొన్నారు. **కోసిగి** తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్ఐ శ్రీరాములుకు వినతిపత్రం అందజేశారు. రైతు సంఘం మండల కార్యదర్శి వీరేష్, సిఐటియు మండల కార్యదర్శి రాముడు, రైతుసంఘం నాయకులు, రైతులు రామకోటి, హనుమంతు, పూజారి శ్రీనివాసులు, ఆదెప్ప, కడియాల నరసప్ప, జలీల్, రామకృష్ణ, చిన్న రెడ్డి, మరి స్వామి, బొంపల్లి వెంకటేష్, గడ్డం నరసయ్య పాల్గొన్నారు.

గోనెగండ్లలో డిప్యూటీ తహశీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కోసిగిలో వినతిపత్రం ఇస్తున్న నాయకులు

రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

వైభవంగా శ్రీసుజయీంద్ర తీర్థుల స్వర్ణ రథోత్సవం

ప్రజాశక్తి - మంత్రాలయం

శ్రీరాఘవేంద్రస్వామి మఠం పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థుల పూర్వాశ్రమ తాత, నవ మంత్రాలయ నిర్మాతగా ప్రఖ్యాతి చెందిన ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన శ్రీరాఘవేంద్రస్వామి మఠం పూర్వపు పీఠాధిపతులు శ్రీసుజయీంద్ర తీర్థుల స్వర్ణ రథోత్సవం వైభవంగా సాగింది. మంగళవారం శ్రీసుజయీంద్ర తీర్థుల ఆరాధన సందర్భంగా శ్రీమఠం పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థుల ఆధ్వర్యంలో శ్రీసుజయీంద్ర తీర్థుల చిత్రపటాన్ని స్వర్ణ రథోత్సవంపై ఉంచి మంగళ హారతులు ఇచ్చారు. అనంతరం శ్రీమఠం ఆవరణంలో మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ శ్రీమఠం ప్రాకారంలో వైభవంగా ఊరేగించారు. అంతకుముందు శ్రీసుజయీంద్ర తీర్థుల బృందావనాన్ని నిర్మాల్యం చేసి పంచామృతాభిషేకం, తులసి అర్చనతో విశేష పూజలు చేశారు. అనంతరం బృందావనాన్ని వెండి కవచాలతో, పుష్పహారాలతో అలంకరించారు. పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు శ్రీసుజయీంద్ర తీర్థుల బృందావనాన్ని దర్శించుకున్నారు. ఊయల మండపంలో శ్రీసుజయీంద్ర తీర్థుల చిత్రపటాన్ని ఉంచి ఊయల సేవ నిర్వహించారు. ఆయన కాలంలో శ్రీరాఘవేంద్రస్వామి మఠం అభివృద్ధికి చేసిన కృషికి నవ మంత్రాలయ నిర్మాతగా ప్రసిద్ధి చెందారని కొనియాడారు.

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కేటాయింపు

- కలెక్టర్ డాక్టర్ సృజన

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించే విధంగా చర్యలు చేపడుతున్నామని కలెక్టర్ డాక్టర్ జి.సృజన తెలిపారు. మంగళవారం జర్నలిస్టుల ఇంటి స్థలాల మంజూరుకు సంబంధించిన జిల్లాస్థాయి కమిటీ సమావేశాన్ని కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. జిఒ నెంబరు 535లో పొందుపరిచిన నిబంధనల ప్రకారం అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేసేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. 5 ఏళ్ల అనుభవం కలిగిన 368 మంది అక్రిడిటేటెడ్ జర్నలిస్టుల జాబితా సమాచార పౌర సంబంధాల శాఖ ద్వారా వచ్చిందన్నారు. ఈ జాబితాను మండల వారీగా విభజించి తహశీల్దార్లకు పంపించి వెరిఫికేషన్ చేయించినట్లు తెలిపారు. దరఖాస్తు చేసుకున్న విలేకరులు కోరుకున్న విధంగా ఆయా మండలాల్లో, డివిజన్ కేంద్రాల్లో, కర్నూలు నగరంలో ఇళ్ల స్థలాల కోసం భూములను గుర్తించినట్లు చెప్పారు. జర్నలిస్టు హౌసింగ్ స్కీమ్‌కు సంబంధించిన కమిటీ సభ్యులు స్థలాలను పరిశీలించాలని సూచించారు. కర్నూలు నగరానికి సంబంధించి రెండు చోట్ల భూమిని గుర్తించినట్లు తెలిపారు. తహశీల్దార్లతో కలిసి వెంటనే ఆ భూములను పరిశీలించి తమ అభిప్రాయం చెప్పాలని కలెక్టర్ తెలిపారు. గురువారం సాయంత్రం పరిశీలిస్తామని కమిటీ సభ్యులు నాగిరెడ్డి తెలిపారు. అనర్హులుగా గుర్తించిన జర్నలిస్టుల వెరిఫికేషన్‌కు సంబంధించి ఏమైనా అభ్యంతరాలు ఉంటే డిఆర్‌ఒ లేదా సంబంధిత తహశీల్దార్‌కు తెలియజేయవచ్చని కలెక్టర్ సూచించారు. అదేవిధంగా నంద్యాల జిల్లాకు సంబంధించిన 15 మంది విలేకరులు కర్నూలు జిల్లాలో పని చేస్తున్నామని, కర్నూలు నగరంలో స్థలం కావాలని కోరారని తెలిపారు. ఆ జాబితాను నంద్యాల డిఆర్‌ఒకు పంపించి వెరిఫై చేయించి, అర్హులైన వారికి ఇళ్ల స్థలాలు కేటాయించే విధంగా చర్యలు తీసుకుంటానని చెప్పారు. డిఆర్‌ఒ మధుసూదనరావు, సమాచార శాఖ డిడి జయమ్మ, కమిటీ మెంబర్ నాగిరెడ్డి, సూపరింటెండెంట్ శ్రీనివాసులు, కల్లూరు, కర్నూలు రూరల్, కర్నూలు అర్బన్ తహశీల్దార్లు మునివేలు, రామాంజులు నాయక్, మోహన్ కుమార్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సృజన

నేడు ఓరియంటేషన్

కర్నూలు కలెక్టరేట్ : విద్యార్థులకు పరీక్షలపై భయాందోళన కలగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు 'ఓరియంటేషన్'ను బుధవారం లలితా కళా సమితిలో నిర్వహిస్తున్నట్లు డిఇఒ శామ్యూల్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సబ్సిడీని సద్వినియోగం చేసుకోవాలి

- డ్వామా పీడీ అమర్‌నాథ్ రెడ్డి
- ఉద్యానవన పంటలు, ఉపాధి హామీ పనుల పరిశీలన

ప్రజాశక్తి - వెల్దుర్తి

ఉద్యానవన పంటలకు మొక్క నుంచి మూడేళ్ల వరకు ప్రభుత్వం అందిస్తున్న వంద సబ్సిడీని రైతులు సద్వినియోగం చేసుకోవాలనీ డ్వామా పీడీ అమర్‌నాథ్ రెడ్డి తెలిపారు. మంగళవారం వెల్దుర్తి మండలం రామళ్లకోట గ్రామంలో రైతులు సాగు చేస్తున్న మామిడి, దానిమ్మ పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అన్ని రకాల ఉద్యానవన పంటల (సపోటా, దానిమ్మ)కు ఉచితంగా మొక్కలు పంపిణీ, వేతన దారులతో గుంతలు తీయించడం, నాటడం, ఎరువులు, ఇంటర్ గ్రాఫింగ్ ఇలా మూడేళ్ల సంరక్షణ కోసం రైతులకు ఒక్కో ఎకరాకు సుమారు రూ.1.50 లక్షల నుంచి రూ.2 లక్షల వరకు ప్రభుత్వం సబ్సిడీ అందిస్తోందని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీనీ రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం బోయినపల్లి, వెల్దుర్తి గ్రామాల్లో చేపడుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. ఎన్ఆర్ఇజిఎస్ కార్యాలయంలో టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లతో సమీక్ష నిర్వహించారు. జాబ్ కార్డు కలిగి ఉన్న ప్రతి కుటుంబానికీ వందరోజుల పని దినాలు కల్పించాలని ఆదేశించారు. వలసలు వెళ్లకుండా అన్ని గ్రామాల్లో ఉపాధి పనులు చేపట్టాలని తెలిపారు. సిబ్బందికి సలహాలు, సూచనలు చేశారు. ఎపిఒ రాజనాయక్, టిఎ నాగేశ్వర్‌రెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

పంటలను పరిశీలిస్తున్న పీడీ అమర్‌నాథ్ రెడ్డి

ఓట్ల లెక్కింపు కేంద్రాల కోసం భవనాన్ని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్, ఎస్పి తదితరులు

నేడు వసంత పంచమి వేడుకలు

- కొలనుభారతి ఆలయం ముస్తాబు
- రాష్ట్రంలో ఏకైక సరస్వతీ దేవి ఆలయం

ప్రజాశక్తి - కొత్తపల్లి

కొత్తపల్లి మండలంలో వెలసిన కొలనుభారతి ఆలయంలో నేడు వసంత పంచమి వేడుకలు వైభవంగా జరగనున్నాయి. ఈ వేడుకలను ఆలయాన్ని సంబంధిత అధికారులు ముస్తాబు చేశారు. భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశారు. రాష్టంలో ఏకైక సరస్వతి దేవాలయం కొలను భారతీ ఆలయం. ఆలయంలో వెలసిన చదువుల తల్లి సరస్వతి దేవి పుట్టినరోజు సందర్భంగా ప్రతి సంవత్సరం నల్లమల అడవుల్లో వెలసిన కొలను భారతి క్షేత్రంలో వసంత పంచమి వేడుకలు వేలాది భక్తుల నడుమ వైభవంగా జరుగుతాయి. ఈ వేడుకలకు సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ముందుగానే జిల్లా స్థాయి అధికారులు ఏర్పాట్లపై అన్ని శాఖల అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి ఆలయ ప్రాంగణంలో పనులను పూర్తి చేశారు. భక్తులకు అవసరమయ్యే అన్ని వసతులు ఏర్పాటు చేశారు. వసంత పంచమి వేడుకలకు చదువుల తల్లి సరస్వతి దేవి అమ్మవారు ప్రత్యేక అలంకరణలో ముస్తాబు అవుతారు. సరస్వతి దేవి అమ్మవారికి శ్రీశైలం దేవస్థానం నుంచి వేకుజామునే దేవస్థానం అధికారులు పట్టు వస్త్రాలు సమర్పిస్తారు. అలాగే రాష్ట నలుమూలల నుంచి అధిక సంఖ్యలో చిన్నారుల అక్షరాభ్యాసాల కార్యక్రమాలు నిర్వహిస్తారు. వచ్చిన భక్తులందరికీ పలు స్వచ్ఛంద సేవా సంస్థల ఆధ్వర్యంలో ఉచిత అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేయనున్నారు.

కొలనుభారతి ఆలయానికి ఇలా వెళ్లాలి..

కొలనుభారతి క్షేత్రం దట్టమైన నల్లమల్ల అడవిలో ఉంది. ఈ ఆలయానికి వెళ్లాలంటే నంద్యాల జిల్లా కేంద్రం నుంచి వచ్చే వారు ఆత్మకూరుకు చేరుకోవాలి. ఆత్మకూరు నుంచి ఆర్టీసీ బస్సుల ద్వారా కొత్తపల్లి, లింగాపురం, శివపురం, శివపురం చెంచు గూడెం నుంచి కొలను భారతి ఆలయం చేరుకోవచ్చు. కర్నూల్ నుంచి నందికొట్కూరు, జూపాడు బంగ్లా, పాములపాడు చేరుకొని అక్కడి నుండి చెలిమిల్ల, కొత్త మాడుగుల, లింగాపురం మీదుగా కొలనుభారతి ఆలయం చేరుకోవచ్చు. ఈ రెండు రహదారుల ద్వారా భక్తులు వాహనాల్లో ఆలయం చేరుకోవచ్చు.

ముస్తాబైన కొలనుభారతి ఆలయం

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై

నివేదికలు ఇవ్వాలి : కలెక్టర్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

రాబోయే ఎన్నికలు జిల్లాలో ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహించేందుకు గుర్తించిన సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల (వలరనబుల్ మ్యాపింగ్) నివేదికలు సమర్పించాలని జిల్లా కలెక్టర్ కె.శ్రీనివాసులు రిటర్నింగ్ అధికారులను, పోలీసు అధికారులను ఆదేశించారు. మంగళవారం వర్చువల్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎన్నికల సమర్థవంత నిర్వహణపై నోడల్ అధికారులు, ఆర్‌డిఒలు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపిడిఒలు, పోలీస్ అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడారు. ఎన్నికల సంఘం సూచించిన మార్గదర్శకాలను పరిగణలోకి తీసుకొని వలరనబుల్ మ్యాపింగ్ రిపోర్టు-2ను సిద్ధం చేసి పంపాలన్నారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించిన అన్ని రకాల బృందాలకు ఈ నెలాఖరులోగా అన్ని శిక్షణలు పూర్తి చేయాలని ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న అన్ని రకాల ఫారంలను వెంటనే పూర్తి చేసి అర్హులైన వారిని ఓటర్ల జాబితాలో నమోదు చేసేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. అలాగే వీడియో వ్యూయింగ్, ఫ్లయింగ్ స్క్వాడ్లు, స్టాటిక్ సెర్వెలెన్స్ తదితర టీమ్‌లను ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. ఆయా బృందాలు నిర్వహించాల్సిన విధులపై సమగ్ర అవగాహన కలిగి ఉండేలా చర్యలు తీసుకో0వాలని ఆదేశించారు.

ఈవిఎంల భద్రతకు, ఓట్ల లెక్కింపు కేంద్రాల కోసం భవనాలను కలెక్టర్, ఎస్‌పి పరిశీలన

వచ్చే సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఈవిఎంల భద్రతా రూములు, ఓట్ల లెక్కింపు కేంద్రాలకు అవసరమయ్యే భవనాలను అయ్యలూరు మెట్ట సమీపంలోని ఎస్‌విఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో జిల్లా కలెక్టర్ కె.శ్రీనివాసులు, ఎస్పి కె.రఘువీర్ రెడ్డిలు పరిశీలించారు. కళాశాలలోని అబ్దుల్ కలాం బ్లాక్‌లో 13 రూములు, సి బ్లాక్‌లో 12 రూములు స్ట్రాంగ్, ఓట్ల లెక్కింపు కేంద్రాలకు విడివిడిగా గుర్తించిన భవనాలను పరిశీలించారు. ఒక్కో నియోజకవర్గం అసెంబ్లీకి రెండు భవనాలు, పార్లమెంట్‌కు రెండు భవనాలు చొప్పున నాలుగు భవనాలు, ఆరు నియోజక వర్గాలకు 24 భవనాలతో పాటు అన్ని నియోజకవర్గాల పోలింగ్ సిబ్బందికి, సెక్యూరిటీ సిబ్బందికి అవసరమయ్యే భవనాలను కూడా పరిశీలించి చేపట్టాల్సిన ఏర్పాట్లపై చర్చించారు. కార్యక్రమంలో నంద్యాల తహశీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

వందశాతం ఉత్తీర్ణత సాధించాలి

- జిల్లా విద్యాశాఖ అధికారి కె.సుధాకర్ రెడ్డి

ప్రజాశక్తి - ఆత్మకూరు

పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని జిల్లా విద్యాశాఖ అధికారి కె.సుధాకర్ రెడ్డి తెలిపారు. మంగళవారం ఆత్మకూరు మండలంలోని ఆశ్రమ పాఠశాలలను, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను జిల్లా విద్యాశాఖ అధికారి తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో అమలవుతున్న విద్యాబోధన, విద్యార్థులకు ఇచ్చిన ట్యాబుల వినియోగంపై డిఇఒ ఆరా తీశారు. అనంతరం ఆయన కొట్టాల చెరువు గ్రామంలో ఏర్పాటు చేయనున్న వసతి గృహానికి అవసరమైన స్థలాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి ఆదివాసి మహా అభియాన్ పథకం కింద 50 మంది విద్యార్థులకు వసతి గృహం నిర్మిస్తున్నట్లు తెలిపారు. వసతి గృహం నిర్మాణం కోసం కేంద్ర ప్రభుత్వం రూ. 2 కోట్ల 30 లక్షలు నిధులు మంజూరు చేసిందని తెలిపారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి జానకి రాముడు, సురేష్, రఘురాం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి : జిసిడిఒ సువర్చల

రుద్రవరం : కస్తూరిబా గురుకుల పాఠశాలలో విద్యనభ్యసించే పది, ఇంటర్ విద్యార్థినులు పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని జిసిడిఒ సువర్చల తెలిపారు. మంగళవారం రుద్రవరంలోని కస్తూర్బా గురుకుల పాఠశాలను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థినులతో మాట్లాడారు. ఏకాగ్రతతో చదవాలని విద్యార్థినులకు సూచించారు. అలాగే విద్యార్థినులకు వడ్డించే భోజనం నాణ్యతను ఆమె పరిశీలించారు. ఆమె వెంట కస్తూరిబా గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ లక్ష్మీదేవి, ఉపాధ్యాయులు ఉన్నారు.

కొట్టాల చెరువులో వసతి గృహ నిర్మాణానికి స్థలాన్ని పరిశీలిస్తున్న డిఇఒ సుధాకర్ రెడ్డి

16న గ్రామీణ బంద్

- జయప్రదం చేయాలి : రైతు సంఘం

ప్రజాశక్తి - బండి ఆత్మకూర్

స్వామినాథన్ కమిటీ సిఫార్సులకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 16న జరిగే గ్రామీణ రైతు బంద్‌ను విజయవంతం చేయాలని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎ.రాజశేఖర్ కోరారు. మంగళవారం బండి ఆత్మకూరులో రైతు సంఘం సమావేశం నాయకులు రాజు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించే ప్రతి పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని, రైతు రుణమాఫీని కేరళ తరహాలో అమలు చేయాలన్నారు. రాష్టంలో స్వామినాథన్ కమిటీ సిఫారసులను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం రైతు సంఘం మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షులుగా పోతిరెడ్డి సుధాకర్ రెడ్డి, కార్యదర్శిగా మద్దిలేటిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. **వెలుగోడు :** స్థానిక సిఐటియు కార్యాలయంలో మండల కార్యదర్శి నాగమోహన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు వి.ఏసురత్నం, మండల నాయకులు మహమ్మద్ రఫీ మాట్లాడారు. రైతుల పంటలకు గిట్టుబాటు ధర చట్టాన్ని చేయాలని, ఏ రంగంలో పని చేసే కార్మికులకైనా కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, కౌలు రైతులకు పంట రుణాలు, పంట నష్టం, ఇన్సూరెన్స్ సౌకర్యం భూ యజమానితో సంబంధం లేకుండా కల్పించాలన్నారు. ఉపాధి పథకాన్ని 200 రోజులకు పెంచి, రోజు వేతనం రూ.600 చెల్లించాలని, ట్రాన్స్ పోర్ట్ కార్మికుల మెడపై పెట్టిన కత్తి హిట్ అండ్ రన్ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాలను కొనసాగించాలని ఈనెల 16న చేపట్టే సమ్మెలో ప్రతి ఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో యూనియన్ నాయకులు వెంకటయ్య, బాష, రహంతుల్లా, కిషోర్ ఎర్రబాషా తదితరులు పాల్గొన్నారు. **పగిడ్యాల :** ఈ నెల 16న గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని వ్యకాస జిల్లా సహాయ కార్యదర్శి పి పక్కీర్ సాహెబ్, సిఐటియు పట్టణ కార్యదర్శి టి.గోపాల కృష్ణ కోరారు. మండలంలోని లక్ష్మాపురం గ్రామంలో ఉపాధి కూలీలు పని చేస్తున్న ప్రదేశానికి వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కేంద్ర కార్మిక సంఘాలు జాతీయ కిసాన్ మోర్చా ఈ నెల 16న తలపెట్టిన బంద్‌ను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో వ్యకాస నాయకులు తిరుపతయ్య, వెంకటేశ్వర్లు, చంద్రశేఖర్ గౌడ్, ఎల్లప్ప, జమ్మన్న, లక్ష్మీదేవి, మణి కుమారి, కృష్ణవేణి, లలితమ్మ, ఉపాధి కూలీలు పాల్గొన్నారు. **నంద్యాల :** ఈ నెల 16న జరిగే గ్రామీణ బంద్, ట్రాన్స్ పోర్ట్ సమ్మె, పారిశ్రామిక సమ్మెను జయప్రదం చేయాలని రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు కోరారు. మంగళవారం నంద్యాలలో ఎఐటియుసి, రైతు, వ్యకాసం, టిఎన్‌టియుసి ఆధ్వర్యంలో రౌండ్టేబుల్ సమావేశం ఎఐటియుసి పట్టణ కార్యదర్శి డి శ్రీనివాసలు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడారు. సమావేశంలో ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి పి సుంకయ్య, రైతు, వ్యకాసం సంఘం జిల్లా కార్యదర్శులు సోమన్న, సుబ్బరాయుడు, టిఎన్‌టియుసి కార్యదర్శి శ్రీరాములు, ఏఐటియుసి జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ డి. శివ బాల కృష్ణ, ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి నాగరాముడు, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ధనుంజయ్ తదితరులు పాల్గొన్నారు.



బండి ఆత్మకూరులో మాట్లాడుతున్న నాయకులు ఎ.రాజశేఖర్

వెలుగోడులో మాట్లాడుతున్న నాయకులు వి.ఏసురత్నం

భూమా దంపతులకు స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

టిడిపి గెలుపును ఎవరూ ఆపలేరు

- మాజీ మంత్రి భూమా అఖిలప్రియ

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి గెలుపును ఎవరూ ఆపలేరని మాజీ మంత్రి భూమా అఖిలప్రియ ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం ఆళ్లగడ్డ మండలం కోటకందుకూరు గ్రామంలో టిడిపి తాలూకా నాయకులు ఆళ్ల నాగ శ్రీనివాసులు ఆధ్వర్యంలో 30 కుటుంబాలు వైసిపిని వీడి టిడిపిలో చేరాయి. పార్టీలో చేరిన గ్రామానికి చెందిన ఆదినారాయణ, బాల దాసరి, జ్వాలా, వారి అనుచర వర్గం సుమారు 30 కుటుంబాల వారికి టిడిపి కండువా కప్పి పార్టీలోకి భూమా అఖిలప్రియ, తాలూకా యువ నాయకులు భార్గవ్ రామ్ ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గంలో రోజురోజుకు టిడిపికి ఆదరణ పెరుగుతుందన్నారు. తమను నమ్మి పార్టీలో చేరిన వారికి భూమా కుటుంబం ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి చాంద్ భాషా, కాంట్రాక్టర్ నన్నే బాయ్ గారి జిలాని తదితరులు ఉన్నారు.

అవుకు తహశీల్దారుగా భాస్కర్

ప్రజాశక్తి - అవుకు

అవుకు మండల తహశీల్దార్‌గా బి.భాస్కర్‌ను ప్రభుత్వం నియమించినట్లు ఇన్‌ఛార్జి తహశీల్దార్ ప్రసాద్ బాబు మంగళవారం తెలిపారు. సాధారణ ఎన్నికల సందర్భంగా తహశీల్దార్ల బదిలీల్లో భాగంగా నంద్యాల కలెక్టరేట్లో పని చేస్తున్న స్పెషల్ తహశీల్దార్ భాస్కర్‌ను అవుకు తహశీల్దారుగా నియమించినట్లు తెలిపారు. త్వరలోనే ఆయన బాధ్యతలు చేపట్టనున్నట్లు వెల్లడించారు.

నేడు 55 వసతి గదుల భవన నిర్మాణానికి భూమి పూజ

ప్రజాశక్తి - మహానంది

ప్రముఖ శైవ క్షేత్రం మహానందిలో భక్తుల వసతి కోసం 55 గదుల భవన నిర్మాణానికి శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి భూమి పూజ చేయనున్నట్లు ఆలయ ఈవో కాపు చంద్రశేఖర్ రెడ్డి మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఇఒ మాట్లాడుతూ ఆలయ నిధులలోని రూ. 10 కోట్ల 50 లక్షలు వ్యయంతో ఈ భవనాన్ని నిర్మిస్తున్నట్లు చెప్పారు. క్షేత్రం అభివృద్ధిలో భాగంగా వసతి గదులు, సిమెంట్ రోడ్లు, గుడి చుట్టూ గ్రీనరీ ఉండే విధంగా ఎమ్మెల్యే సహకారంతో ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు.

జెఈఈ మెయిన్స్‌లో 'ఎస్‌డిఆర్ ఆకాంక్ష' విజయ దుందుభి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

జెఈఈ మెయిన్-20242 ఫలితాలలో యస్‌డిఆర్ ఆకాంక్ష జూనియర్ కాలేజీ విద్యార్థులు మళ్ళీ విజయ దుందుభి మోగించారు. విద్యార్థి ఎం.మోహన కృష్ణ 99.95 శాతంతో రాయలసీమలోనే మొదటి ర్యాంకును కైవసం చేసుకున్నాడు. కె.జితేంద్ర 99.36, కె.నాగ పవన్ కుమార్ 97.63, వి.కార్తికేయ రెడ్డి 96.78, 90 శాతంతో 18 మంది విద్యార్థులు అద్భుతమైన ఫలితాలను సాదించారు. మంగళవారం కళాశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభకు ముఖ్య అతిథులుగా డిఎస్‌పి కె.రవీంద్రనాథ్ రెడ్డి, డాక్టర్ గెలివి సహదేవుడు, టు టౌన్ సిఐ మంజునాథ్ రెడ్డి, ఎస్‌విఆర్ ఇంజనీరింగ్ కాలేజీ చైర్మన్ ఎస్.వెంకట రామిరెడ్డిలు విచ్చేసి అద్భుత ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందిచారు. ఇందుకు కృషి చేసిన అధ్యాపకులను చైర్మన్ యస్.కొండారెడ్డి అభినందించారు. ఈ సందర్భముగా అత్యధిక ర్యాంకులు సాధించిన విద్యార్థులు మాట్లాడుతూ తమకు ఈ ఫలితాలు రావడానికి గల కారణం తమకు బోధించిన అధ్యాపకులు, అధ్యాపకేతర బృందమని తెలిపారు. అందుకు కృషి చేసిన అధ్యాపక, అధ్యాపకేతర బృందానికి కృతజ్ఞతలు తెలిపారు.

జెఈఈ మెయిన్స్‌లో ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న ముఖ్య అతిథులు

కేక్ కట్ చేస్తున్న దృశ్యం

జెఈఈ మెయిన్స్‌లో 'రావూస్' విజయ పరంపర

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

జెఈఈ మెయిన్స్ ఫలితాలలో రావుస్ కళాశాల విద్యార్థులు విజయ పరంపర కొనసాగించారు. ఎన్‌టిఏ ప్రకటించిన జె ఈ ఈ మెయిన్స్ ఫేస్-1 ఫలితాలలో రావుస్ విద్యార్థులు అద్భుతమైన ఫలితాలు సాధించినట్లు కళాశాల చైర్మన్ ఏఎంవి అప్పారావు, డైరెక్టర్ మోని చంద్ర తెలిపారు. మంగళవారం కళాశాలలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. తమ విద్యార్థులు బివి కార్తికేయ శర్మ 97.938, ఆర్. విష్ణు ప్రియ 90.336, ఈ.సౌజన్య (ఓబీసీ) 89.129, ఎంవి పద్మావతి(ఎస్సీ) 88.498, శ్రీరంగబరత్ 83.972, జి.శ్రావ్య 83.696, ఆర్.సమీరా 83.647, డి చిన్న మౌలాలి 83.355, టి సత్య మహేశ్వరి 81.957, జి.నందకిషోర్ 81.039 శాతాలతో రావుస్ విజయ పరంపర కొనసాగించారని తెలిపారు. ఫేస్-2 ఫలితాలలో ఇంతకన్నా మెరుగైన ఫలితాలలో మీ ముందుంటామని తెలియజేశారు. గత విద్యా సంవత్సరం నుండి సింగిజి మెటీరియల్ ద్వారా శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఇంతటి ఫలితాలు సాధించిన విద్యార్థినీ విద్యార్థులను, తల్లిదండ్రులను, అధ్యాపక బృందాన్ని వారు అభినందించారు.

జెఈఈ మెయిన్స్‌లో ర్యాంకులు సాధించిన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

గిరిజనుల అభ్యున్నతే ధ్యేయం

- ఎస్‌టి కమిషన్ సభ్యులు శంకర్ నాయక్

ప్రజాశక్తి - నంద్యాల రూరల్

రాష్ట్రంలోని గిరిజనుల అభ్యున్నతే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందనిరాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యులు వడిత్యా శంకర్ నాయక్ అన్నారు. మంగళవారం నంద్యాలలోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. అటవీ ప్రాంతాల్లో నివసించే గిరిజనుల చైతన్యమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిందని తెలిపారు. రాష్ట్రంలో ఎన్నడు లేని విధంగా ఎస్టీ కమిషన్ను ఏర్పాటు చేసి గిరిజనుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తుందన్నారు. విద్య, వైద్య రంగాలలో అనేక సంస్కరణలు చేసిన ప్రభుత్వం గిరిజనులకు మౌలిక సదుపాయాల కల్పనలో పెద్దపీట వేసిందన్నారు. మునుపెన్నడూ లేని విధంగా గిరిజనుల భూ యజమానుల హక్కుల కోసం ఆర్ఒఎఫ్ఆర్‌ను ప్రవేశపెట్టి వారిని యజమానులుగా తయారు చేసిన ఘనత సిఎం జగన్మోహన్ రెడ్డికి దక్కుతుందన్నారు. అలాగే పదవుల్లో, పనుల్లో 50 శాతంపైగా రిజర్వేషన్లను కల్పించి నాయకులుగా తీర్చిదిద్ది సామాజిక న్యాయం చేశారన్నారు. గత ప్రభుత్వంలో గిరిజనాభివృద్ధికి ఐదేళ్ల కాలంలో రూ.5 వేల కోట్లు వెచ్చిస్తే నేడు రూ.20 వేల కోట్ల పైగా నిధులను వెచ్చించిందన్నారు. సమావేశంలో జిపిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాజు నాయక్, జాతీయ ఉపాధ్యక్షుడు మల్లికార్జున నాయక్, రాష్ట్ర సహాయ కార్యదర్శి రవి నాయక్, విద్యార్థి విభాగం రాయలసీమ ఇన్చార్జి రవీంద్ర నాయక్, గిరిజన సంక్షేమ శాఖ అధికారి ఉశెనయ్య, సోషల్ మీడియా ఇన్చార్జ్ హనుమంతు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎస్టీ కమిషన్ సభ్యులు శంకర్ నాయక్

ఆరోగ్య శిబిరాన్ని పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి వెంకటరమణ

ఆరోగ్య సురక్షను సద్వినియోగం చేసుకోవాలి

- జిల్లా వైద్య అధికారి డాక్టర్ వెంకటరమణ

ప్రజాశక్తి - బనగానపల్లె : జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వైద్య అధికారి డాక్టర్ వెంకటరమణ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని కైప గ్రామంలో టంగుటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శివశంకరుడు ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష ఫేస్-2 వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ ఆరోగ్య శిబిరాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిపి, షుగరు, గుండె జబ్బులు, రక్తహీనత, కంటి తదతర వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రామ్ ఆఫీసర్ జగదీశ్వర్ రెడ్డి, యుఆర్‌డి ప్రసాద్, ఎంబిహెచ్ఈఓ వెంకటేశ్వర్లు, గ్రామపంచాయతీ ఈవో ఖలీల్, వైసిపి నాయకులు మోదుల్లా, ప్రతాపరెడ్డి, ఎంపిహెచ్ఇఒ వెంకటేశ్వర్లు, ఆరోగ్య సిబ్బంది, సూపర్వైజర్, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

కాటసాని గెలుపునకు కృషి చేయాలి

- యువ నాయకుడు కాటసాని శివ నరసింహారెడ్డి

ప్రజాశక్తి - పాణ్యం : వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో కాటసాని గెలుపునకు కార్యకర్తలంతా కలిసి కట్టుగా పని చేయాలని వైసిపి యువనాయకుడు కాటసాని శివ నరసింహా రెడ్డి సూచించారు. మంగళవారం వైసిపి పాణ్యం మండల నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సారి పాణ్యం నుండి మంచి మెజారిటీ వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు చందమామ బాబు, పాలం చంద్ర శేఖర్ రెడ్డి, సుబ్బరాయుడు, గౌడ్, జాకీర్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కాటసాని శివ నరసింహా రెడ్డి

డీఎస్సీ నోటిఫికేషన్ ప్రతులను దహనం చేస్తున్న యుటిఎఫ్ నేతలు

అప్రెంటీస్ విధానం అన్యాయం : యుటిఎఫ్

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్

అప్రెంటిస్ విధానం అమలు చేయడం అన్యాయం అని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జే . సుధాకర్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ఉపాధ్యాయ నియామక ప్రక్రియలో అప్రెంటిస్ విధానాన్ని ప్రవేశపెట్టడాన్ని నిరసిస్తూ మంగళవారం నందికొట్కూరు డివిజన్ కేంద్రంలో నందికొట్కూరు మండల విద్యాశాఖ కార్యాలయం ముందు యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జే సుధాకర్ ఆధ్వర్యంలో జీఓ కాపీలను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ రంగంలోఉన్న సమస్యలను పరిష్కరించకుండా, కొత్త సమస్యలను కావాలని సృష్టిస్తూ ఉద్యోగ ఉపాధ్యాయ, నిరుద్యోగ యువకులను మోసం చేసే విధంగా డీఎస్సీనీ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించటం సిగ్గుచేటు అన్నారు. విడుదలైన డీఎస్సీ నోటిఫికేషన్ మెగా డీఎస్సీ కాదనీ దగా డీఎస్సీ అని తెలిపారు. సుదీర్ఘకాలం అనేక పోరాటాలు చేసి రద్దు చేసుకున్న అప్రెంటిస్ విధానాన్ని తిరిగి పునరుద్ధరింప చేస్తూ ఉత్తర్వులు ఇవ్వడం దుర్మార్గమని, ఈ నోటిఫికేషన్‌ను రద్దు చేసి కొత్త నోటిఫికేషన్ విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్. జిల్లా కార్యదర్శులు వెంకట ప్రభాకర్ రెడ్డి, మండల సహాధ్యక్షులు తిరుమలయ్య, సహాధ్యక్షు రాలు జయమ్మ, మహిళా ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

27న చలో విజయవాడ

ప్రజాశక్తి - ఆత్మకూర్

మాట్లాడుతున్న ఎన్జీవో తాలూకా అధ్యక్షుడు మోహన్ రెడ్డి

ఈనెల 27వ తేదీన విజయవాడలో జరిగిన ఆందోళన కార్యక్రమం విజయ వంతం చేయాలని ఆత్మకూరు డివిజన్ ఎన్జీవో అధ్యక్షుడు మోహన్ రెడ్డి, కార్యదర్శి సాజిద్ బాషలు అన్నారు. మంగళవారం నాడు జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఉద్యోగ కార్మిక ఉపాధ్యాయ పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వివిధ రూపాలను ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ప్రభుత్వం ఈ విషయాలపై స్పందించకుంటే 27వ తేదీన జరిగే చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు అన్నారు. ఈ సమావేశంలో ఏపీటీఎఫ్ నాయకులు శంకర్, విశ్రాంతి, ఉద్యోగుల సంఘం నాయకులు అచ్చయ్య, ఎన్జీవో సంఘం నాయకులు రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతకు పెద్దపీట : ఎమ్మెల్యే


చాగలమర్రి : మెగా చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

ప్రజాశక్తి - విలేకరులు

చాగలమర్రి : రాష్ట్ర ప్రభుత్వం మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే బిజేంద్రా రెడ్డి అన్నారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో జగనన్న నాలుగో విడత ఆసరా సంబరాలు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి హాజరై మండలంలోని 318 గ్రామ ఐక్య సంఘాలకు రూ.1 కోటి 64 లక్షల ఆసరా చెక్కును విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం మహిళల సంక్షేమం కోసం ఎలాంటి పథకాలు అమలు చేయలేదని విమర్శించారు. కేవలం ఎన్నికలు వస్తేనే టిడిపి నాయకులకు ప్రజలు గుర్తుకొస్తారని వారు విమర్శించారు. ఆస్తులు ఆక్రమించుకున్న వారి జాబితాలలో ఎవరు ఉండేది అనేది ఆళ్లగడ్డ నియోజకవర్గ ప్రజలకు తెలుసు అని, కిడ్నాపుల ఘనత ఎవరిదో ప్రజలకు బాగా తెలుసునని వారు వ్యాఖ్యానించారు. ప్రభుత్వంలో మంచి జరిగి ఉంటే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి తిరిగి ఓటు వేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు వీరభద్రుడు,జిల్లా జెసిఎస్ కోఆర్డినేటర్ షేక్ బాబులాల్, మండల కన్వీనర్ కుమార్ రెడ్డి, చాగలమర్రి మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ తులసమ్మ, జడ్పిటిసి లక్ష్మీదేవి, మహిళా సాధికారిక సంస్థ డైరెక్టర్ శ్రీ బాలవిద్య, మండల ఉపాధ్యక్షుడు ముల్లా రఫీ, సింగిల్ విండో అధ్యక్షుడు దస్తగిరి, సీనియర్ నాయకులు గొడిగనూరు ఎంపిటిసి పత్తి నారాయణ మార్కెట్ యార్డ్ డైరెక్టర్ ముల్లా జాబిర్, ఎంపీడీవో సూర్యనారాయణ రెడ్డి, తహసిల్దార్ రమణమ్మ, వెలుగు ఏరియా కోఆర్డినేటర్ దానం, ఏపీఎం నాగమ్మ, వైసిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రుద్రవరం : వైయస్సార్ కుటుంబంతోనే మహిళలకు సంక్షేమ ఫలాలు అందాయని, మహిళల అభివృద్ధే లక్ష్యమని ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రారెడ్డి అన్నారు. మంగళవారం రుద్రవరంలోని మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన ఆసరా నాలుగో విడత చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రుద్రవరం మండలంలో నాలుగో విడత ఆసరా కార్యక్రమం కింద 664 పొదుపు గ్రూపులకు రూ.4.60 కోట్లు మహిళల బ్యాంకు ఖాతాలలో జమ చేసినట్లు తెలిపారు. ఇప్పటివరకు నాలుగు విడతలుగా రూ.18. 37 కోట్లు నిధులు జమ అయ్యాయని చెప్పారు. రాబో యే ఎన్నికల్లో ప్రజల సంక్షేమం కోరే జగన్మోహన్ రెడ్డిని, తనను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఆళ్లగడ్డ మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్ గంధం రాఘవరెడ్డి, వైసిపి మండల కన్వీనర్ ప్రసాద్ రెడ్డి, సచివాలయం కన్వీనర్ పాణ్యం నాగేష్, పుట్టాలమ్మ క్షేత్రం కార్యవర్గ సభ్యులు గంగిశెట్టి తిమ్మయ్య, ఎంపీడీవో రామచంద్ర, వెలుగు ఏరియా కోఆర్డినేటర్ దానం, ఏపిఎం కల్పలత, జడ్పిటిసి మాధవి, సర్పంచ్ బైరి విజయలక్ష్మి, మండల మహిళా సంఘం అధ్యక్షురాలు సుదేవి మహిళలు పాల్గొన్నారు.

పాములపాడు చెక్కును పంపిణీ చేసిన దారా సుధీర్, నాయకులు, అధికారులు

మహిళా సాధికారతే ప్రభుత్వ ధ్యేయం : ధార సుధీర్

పాములపాడు : మహిళలు అభివృద్ధి చెందినప్పుడు తన కుటుంబం గ్రామం రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని సమాజంలో మహిళలదే కీలక పాత్ర అని, ముఖ్యమంత్రి మహిళలకు పెద్దపీట వేస్తున్నారని నందికొ ట్కూర్ వైసిపి ఇన్చార్జ్ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ధార సుదీర్ అన్నారు. మంగళవారం పాములపాడు ఎంపీడీవో కార్యాలయం ఆవరణంలో నాలుగో విడత ఆసరా పథకం చెక్కు పంపిణీ కార్యక్రమాన్ని ఐకెపి వెలుగు ఏపిఎం అనురాధ ఆధ్వర్యంలో పొదుపు మహిళలకు చెక్కు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డాక్టర్ ధార సుధీర్, ఎంపీడీవో సరస్వతి, వైసిపి మండల అధ్యక్షులు రామలింగేశ్వర రెడ్డి, మద్దూర్ సింగిల్ విండో సొసైటీ చైర్మన్ గడ్డం కృష్ణారెడ్డి, వేంపెంట సింగిల్ విండో చైర్మన్ మచ్చ వెంకటస్వామి, మండల జేఏసీ ఇన్చార్జి టి నాగరాజులు జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేసి మండలానికి ఆసరా పథకం కింద వచ్చిన రూ.4 కోట్ల 93 లక్షల చెక్కును పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ సిఎం జగన్ నేరుగా మహిళల ఖాతాలోకి పథకాల నగదును జమ చేస్తూ ఎలాంటి అవినీతి లేకుండా నగదు వారికే అందుతుందన్నారు. మళ్లీ జగనన్నే దీవించాలని వారు కోరారు. అనంతరం పొదుపు మహిళలు మాట్లాడారు. రెండు లక్షల వరకు బ్యాంకులో లోన్ ఇస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు చంద్రారెడ్డి వరప్రసాద్, రామస్వామి, చింతల నారాయణ, వైసీపీ నాయకులు విజయసింహారెడ్డి, చౌడయ్య, శీలా రెడ్డి, ఎల్వి రమణారెడ్డి, బాలేశ్వర్ రెడ్డి, బంగారు బాష, సొసైటీ డైరెక్టర్ గోపాల్, నాయకులు కోట్ల నాగేశ్వర్ రెడ్డి, చరణ్ కుమార్, కమలాకర్, మాలిక్ భాషా, జబ్బార్, సమ్మద్, పుల్లయ్య వివిధ గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

బేతంచెర్ల : మండలంలోని పొదుపు గ్రూపులలో ఉన్నటువంటి7,543 మంది అక్క చెల్లెమ్మలకు రూ.4.88 కోట్ల రూపాయలు ఆసరా పథకం కింద వైయస్సార్ జగన్ అన్న ప్రభుత్వం మంజూరు చేసినట్లు బేతంచర్ల ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, గిడ్డంగుల శాఖ రాష్ట్ర డైరెక్టర్ బాబుల్ రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ సిహెచ్ చలం రెడ్డి అన్నారు. బేతంచర్ల కర్నూల్ రోడ్ లోని శ్రీ షిరిడి సాయిబాబా మందిరం మండపంలో బేతంచెర్ల మండలం ఎంపీడీవో రవి ప్రసాద్, ఏపీఎం రామాంజనేయులు అధ్యక్షతన పొదుపు మహిళలకు ఆసరా పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పొదుపు మహిళల అభివృద్ధి కోసం చేయూత సూపర్ మార్కెట్ ఏర్పాటు చేసుకునే విధంగా ఎన్నో అవకాశాలు కల్పించారని అన్నారు. అనంతరం రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి చిత్రపటానికి పొదుపు మహిళలు పాలాభిషేకం చేశారు. బేతంచర్ల జడ్పిటిసి శివలక్ష్మి, ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, రాష్ట్ర గిడ్డంగుల శాఖ డైరెక్టర్ బాబు రెడ్డి చేతుల మీదుగా ఆసరా చెక్కులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల జడ్పిటిసి శివలక్ష్మి, పొదుపు మహిళల మండల అధ్యక్షురాలు లక్ష్మీదేవి, ఉర్దూ అకాడమీ రాష్ట్ర కమిటీ సభ్యులు ఎస్ మూర్తి జావలి, సచివాల వైయస్సార్ మండల కన్వీనర్ తిరుమలేశ్వర్ రెడ్డి, వాల్మీకి ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు మురళీకృష్ణ, నాగరాజు, వైస్ ఎంపీపీ రంగస్వామి, గోరుమానుకొండ సర్పంచ్ కోడె వెంకటేశ్వర్లు, మండలంలోని వివిధ గ్రామాల పొదుపు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సిద్ధం సభను జయప్రదం చేయాలి : గంగుల

ప్రజాశక్తి - చాగలమర్రి

ఈనెల 18వ తేదీన ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి పాల్గొనే అనంతపురం జిల్లా రాప్తాడులో జరిగే సిద్ధం సభను జయప్రదం చేయాలని చాగలమర్రి మండలంలోని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులకు నాయకులకు కార్యకర్తలకు అభిమానులకు రాష్ట్ర జలవనరుల శాఖ ప్రభుత్వ సలహాదారు గంగుల ప్రభాకర్ రెడ్డి, ఆళ్లగడ్డ శాసనసభ్యులు గంగుల బిజేంద్రారెడ్డిలు కోరారు. మంగళవారం చాగలమర్రిలో నిర్వహించిన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. ప్రతి గ్రామం వైసిపి నాయకులు కార్యకర్తలు విరివిగా హాజరు కావాలన్నారు.

ప్రత్యేక బస్సులను భోజన ఏర్పాట్లను చేస్తున్నామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా జెసిఎస్ అధ్యక్షుడు షేక్ బాబూలాల్, మండల అధ్యక్షుడు వీరభద్రుడు, మండల కన్వీనర్ కుమార్ రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు ముల్లా రఫీ, ఎంపిటిసి సభ్యులు పత్తి నారాయణ, ఫయాజ్, లక్ష్మిరెడ్డి, సర్పంచులు బంగారు షరీఫ్, గోవిందయ్య ప్రతాప్ రెడ్డి, సింగల్ ఫ్రిండ్ అధ్యక్షుడు దస్తగిరి, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు గణేష్ రెడ్డి, సాగునీటి సంఘ అధ్యక్షుడు శేషు రమేష్, నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్నఏపీ జలవనరుల శాఖ సలహాదారులు గంగుల, ఎమ్మెల్యే గంగుల నాని

వైసిపిని ఇంటికి సాగనంపాలి : టిడిపి

ప్రజాశక్తి-డోన్

వైసిపి ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపాలని డోన్ నియోజకవర్గ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి ధర్మవరం మన్నే సుబ్బారెడ్డి అన్నారు. మంగళవారం డోన్ మండలంలోని గోసానిపల్లె గ్రామంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమం డోన్ మండలం టిడిపి అధ్యక్షులు సలీంద్ర శ్రీనివాసులు యాదవ్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మన్నే సుబ్బారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ధర్మవరం మన్నే సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఇంటింటికీ తిరిగి తెలుగుదేశం పార్టీ విడుదల చేసిన మినీ మేనిఫెస్టోలోని సూపర్ సిక్స్ పథకాలను తెలుగుదేశంపార్టీ అధికారంలోకి రాగానే అమలు చేస్తామని,వైసీపీ ప్రభుత్వంలో ప్రజల పరిస్థితి ఎలా ఉందంటే చివరకు చెత్తకు కూడా పన్ను కట్టే పరిస్థితి వచ్చిందన్నారు. ప్రతి ఒక్కరం ఈ వైసిపి ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపాలని, డోన్‌లో తెలుగుదేశంపార్టీ గెలుపుకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డోన్ పట్టణ టిడిపి అధ్యక్షులు చాటకొండ శ్రీనివాసులు, యూనిట్ ఇంచార్జ్ కమలాపురం రమేష్,సింగిల్ విండో డైరెక్టర్ మధుసూదన్ రెడ్డి, గోవిందరెడ్డి, డోన్ మండలం టిడిపి బీసీ సెల్ అధ్యక్షులు రామాంజనేయులు,మెట్ట మద్దయ్య నంద్యాల జిల్లా రైతు కమిటీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ రాజశేఖర్ రెడ్డి,డోన్ నియోజకవర్గ టిడిపి రైతు కమిటీ అధ్యక్షులు మల్లయ్య,డోన్ మండలం టిడిపి ప్రధాన కార్యదర్శి ఎల్ఐసి శ్రీరాములు,భాస్కర్ రెడ్డి, కిట్టు, శ్యామ్ సుందర్ రెడ్డి, అడ్వకేట్ రాముడు, సురేష్, ధను, ప్రసాద్, శ్రీరాములు, రాజేష్, రామాంజినేయులు, రమేష్, నారాయణ, అంజి, అచ్చన్న, సుంకన్న, వేంకటేష్, రాముడు, రాముడు, శంకర్, వెంకటరాముడు,రామదాసు తదితరులు మండల టిడిపి నాయకులు పాల్గొన్నారు.

ప్రజలతో మాట్లాడుతున్న ధర్మవరం మన్నే సుబ్బారెడ్డి

కలెక్టర్‌ను కలసిన ఐటిడిఎ పిఒ

ప్రజాశక్తి - శ్రీశైలం ప్రాజెక్ట్

కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ప్రాజెక్ట్ అధికారి డా.బి.రవీంద్ర రెడ్డి

ఐటిడిఎ పిఒ డాక్టర్ బి రవీంద్ర రెడ్డి నంద్యాల జిల్లా కలెక్టర్ కె.శ్రీనివాసులును మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు పిఒ చెంచులకు సంబంధించిన సమస్యలను, ప్రధాన మంత్రి జనజాతి ఆదివాసి మహా అభియాన్ క్రింద చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. సమస్యల పరిష్కారానికి కలెక్టర్ సానుకూలంగా స్పందించారు.

నీళ్ల ట్యాంకు నిర్మాణానికి భూమి పూజ

ప్రజాశక్తి -ప్యాపిలి

పట్టణంలోని జగనన్న కాలనీలో ఓహెచ్ ఆర్ ట్యాంక్ నిర్మాణానికి జెడ్పిటిసి శ్రీరామరెడ్డి, వ్యవసాయ సలహా మండల చైర్మన్ మెట్టు వెంకటేశ్వర్ రెడ్డి, సర్పంచ్ లక్ష్మీదేవి భూమి పూజ చేశారు. 40 వేల లీటర్ల సామర్థ్యం గల 25 లక్షల రూపాయలతో ఓహెచ్ఆర్ ట్యాంక్, బోరు పైపులైన్, ఇంటింటికి కొలాయి మొత్తం 45 లక్షలతో నిర్మాణం చేపట్టనున్నట్టు తెలిపారు. జగనన్న కాలనీకి నీరు అందించాలని ట్యాంక్ నిర్మిస్తే ఎటువంటి నీళ్ల సమస్యలు ఉండవన్నారు.ఈ కార్యక్రమంలో చంద్ర శేఖర్ రెడ్డి, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ రవి, సైట్ ఇంజనీర్ విక్కీ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఇన్స్పైర్ మాంక్ ప్రదర్శనకు విద్యార్థుల ఎంపిక

ఎంపికైన విద్యార్థితో హెచ్ఎం,ఉపాధ్యాయులు

ఎంపికైన విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి - చాగలమర్రి

జిల్లా స్థాయి ఇన్స్పైర్ మనక్ విద్యార్థుల సైన్స్ ప్రాజెక్టుల ప్రదర్శనలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాలుర విద్యార్థి జీ గఫర్ బాబా రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. మంగళవారం ఏర్పాటు చేసిన అభినందన సభలో హెచ్ఎం కోటయ్య మాట్లాడుతూ ఈ నెల 11, 12న నంద్యాలలో జిల్లా వ్యాప్తంగా మొత్తం 173 సైన్స్ ప్రాజెక్టు పాల్గొనగా అందులో గఫార్ బాబా తయారు చేసిన ప్రాజెక్టు యూజింగ్ స్మార్ట్ కార్డుకు రాష్ట్రస్థాయికి ఎంపికైందన్నారు. ఈ విద్యార్థికి గైడ్ టీచరుగా వ్యవహరించిన ఎర్రగుడి శ్రీనివాసులును,విద్యార్థి గఫార్‌లను హెచ్ఎం,ఉపాధ్యాయ బృందం అభినందించారు.

వేంపెంట్ హైస్కూల్ విద్యార్థి ఎంపిక

పాములపాడు: వేంపెంట జడ్పీహెచ్ హైస్కూల్ విద్యార్థి సంతోష్ రాజ్ రాష్ట్రస్థాయి ఇన్స్పైర్ మాంక్ ప్రదర్శనకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు కృష్ణమూర్తి తెలియజేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఇటీవలే నంద్యాలలో సెయింట్ జోసఫ్ హైస్కూల్లో జరిగిన జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో పదవ తరగతి చదువుతున్న సంతోష్ రాజు అనే విద్యార్థి తక్కువ ఖర్చుతో సోలార్ అగ్రికల్చర్ పెస్టిసైడ్స్ విత్ స్ప్రేయర్ విత్ లో కాస్ట్ (solar agriculture pesticide with spair with low cost) చేసే విధానం కనుక్కొని జిల్లా స్థాయిలో మొదటి స్థానం సంపాదించి రాష్ట్ర స్థాయికి ఎంపిక అయినప్పుడు తెలిపారు. ఈనెల 18, 19 తేదీలలో చిత్తూరు జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారని తెలిపారు. ఎంపికైన విద్యార్థిని ఉపాధ్యాయునిలు విద్యార్థులు విద్యార్థునిలు అభినందించారు. సీనియర్ ఉపాధ్యాయుడు నాగ శేషులు, పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ నాగరాజు, షరీఫ్, కోటయ్య పాల్గొన్నారు.

పామాయిల్ పంటలపై అవగాహన

ప్రజాశక్తి - మిడుతూరు

మండలంలోని నాగలూటి గ్రామంలో పామాయిల్ పంటలపై రైతులకు మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పామాయిల్ సంస్థ జనరల్ మేనేజర్ విజయ్ ప్రసాద్ మాట్లాడుతూ మండలంలోని నాగలోటి గ్రామంలో పామాయిల్ పంటకు అనువైన భూమిగా అబ్దుల్ కరీం పొలంలో పామ్ ఆయిల్ మొక్కలు నాటించడం జరిగిందని ఈ పామాయిల్ మొక్కలు విస్తారంగా పంట సాగు చేస్తే రైతులకు ఎంతో ఉపయోగంగా ఉంటుందన్నారు. పామాయిల్ మొక్కలను నర్సరీల ద్వారా రైతులకు అందిస్తామన్నారు. అలాగే రైతులు పామాయిల్ పంటలను సాగు చేయదలచిన వారు ఆర్‌బికెలో రైతులు తమ పేర్లను నమోదు చేసుకున్నట్లయితే ప్రభుత్వం ద్వారా సబ్సిడీ రూపంలో పామాయిల్ మొక్కలను అందజేస్తామని వారు అన్నారు. జిల్లాలో మొట్టమొదటిసారిగా ఈ నాగాలోటి గ్రామంలోనే పంట సాగు చేయడం జరుగుతుందన్నారు. ఈ పామాయిల్ పంటలు సాగు చేయడం వలన ప్రభుత్వం నుండి సహాయ సహకారాలు ఉంటాయని వారు అన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డిహెచ్ఓ నాగరాజు, రైతులు తులసి రెడ్డి, చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మొక్కలను నాటుతున్న దృశ్యం

వంట పాత్రలో పడి.. చిన్నారికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - చాగలమర్రి

గాయపడ్డ చిన్నారి జయసింహ

మండల కేంద్రమైన చాగలమర్రిలోని కోటగడ్డ వీధిలో మంగళవారం ఇంట్లో వంట చేస్తుండగా ప్రమాదవశాత్తు నాలుగు సంవత్సరాల చిన్నారి జయసింహ వంట పాత్రలో పడి తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబీకులు హుటాహుటిన స్థానిక కేరళ వైద్యాశాలకు తరలించారు. చిన్నారి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం నంద్యాలకు తరలించినట్లు కుటుంబీకులు తెలిపారు.

ప్రయాణికులకు బస్ షెల్టర్ ఏర్పాటు

- మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్

ప్రజాశక్తి-డోన్

బస్ షెల్టర్ కోసం స్థలాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్

బేతంచెర్ల,నంద్యాల,రాయలచెరువు వెళ్లే ప్రయాణికులు ఇబ్బంది పడకుండా ఉండేందుకు బస్ షెల్టర్ ఏర్పాటు చేయనున్నట్లు డోన్ మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ తెలిపారు. మంగళవారం డోన్ పట్టణంలోని బేతంచెర్ల సర్కిల్ నందు రానున్న ఎండాకాలంను దృష్టిలో ఉంచుకొని బేతంచెర్ల, నంద్యాల, రాయలచెరువు వెళ్లే ప్రయాణికుల కోసం సేగు థియేటర్ ఎదురుగా ఏర్పాటు చేయబోయే బస్ షెల్టర్ స్థలాన్ని మున్సిపల్ చైర్మన్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైల్వే వారు డబల్ లైన్ కోసం బస్సు షెల్టర్ ను పడగొట్టడం జరిగిందని రానున్న ఎండాకాలంలో ప్రయాణికులు ఎటువంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా ముందస్తుగా రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ఆదేశాల మేరకు సేగు థియేటర్ ఎదురుగా బస్ షెల్టర్ ఏర్పాటు చేస్తున్నామని,ప్రజలు గమనించాలని మున్సిపల్ చైర్మన్ కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జయరాం,ఆర్టీసీ డిపో మేనేజర్ ఎం.శశి భూషణ్, మున్సిపల్ వైస్ చైర్మన్ ఎస్ఎండి జాకీర్ హుస్సేన్,మున్సిపల్ డిఈ రసూల్,టౌన్ ప్లానింగ్ అధికారి అంజాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ మెరుగైన వైద్య సేవలు

ప్రజాశక్తి - కొత్తపల్లి

గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ప్రతి ఇంటికి మెరుగైన వైద్యసేవలు అందించించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని ఎంపీడీఓ జవహర్ బాబు అన్నారు. సోమవారం మండలంలోని ముసలమడుగు గ్రామంలో రెండ వవిడత జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపును వైద్యుడు జబీర్ గ్రామ సర్పంచ్ జమీలాబీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణులకు నాణ్యమైన, మెరుగైన వైద్యసేవలు అందించేందుకు ప్రభుత్వం ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంపును ఏర్పాటు చేశారన్నారు. ప్రజలకు ఉచితంగా వైద్యపరీక్షలు, నిర్వహించడంతోపాటు మందులను పంపిణీ చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కంటివైద్య నిపుణుడు షేక్షావలి, చిన్నపిల్లల వైద్యులు సౌఖత్ ఖాదిర్, మాజీ వైస్ ఎంపీపీ మహబూబ్ బాషా, సూపరెంటెంట్ సుబ్రహ్మణ్యం, సిబ్బంది పాల్గొన్నారు.

కంటి పరీక్షలు చేస్తున్న కంటి వైద్య నిపుణుడు

ప్యాపిలి : జగనన్న ఆరోగ్య సురక్ష పథకం పేదలకు వరం లాంటిదని ఎంపీడీవో సాయి మనోహర్ అన్నారు. ప్యాపిలి 4వ సచివాలయంలో డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ చెన్నకేశవ ఆధ్వర్యంలో నిర్వహిం చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో 1059 ఉన్న ఆరోగ్య వైద్య సేవలను జగనన్న ప్రభుత్వం 3257 కు పెంచిదని ఈ పథకాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగపరచుకోవాలన్నారు. డాక్టర్లు వాణిశ్రీ, నరేష్,దీపిక అందరు కలిసి 510 మందికి ఓపి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఈవో శివకుమార్ గౌడ్, రాఘవేంద్ర గౌడ్, మనోహర్ రెడ్డి, గంగాదేవి, ఉష, ఎం ఎల్ హెచ్ పి లు, ప్రసన్న, వైద్య, వాలంటీర్లు ఆశాలు పాల్గొన్నారు.

జి. లింగాపురంలో ఎద్దుల బల ప్రదర్శన పోటీలు

పోటీలను ప్రారంభిస్తున్న నాయకులు శిల్పా కార్తీక్ రెడ్డి

ప్రజాశక్తి - బండి ఆత్మకూర్

మండలంలోని జి లింగాపురం గ్రామంలో పరిశుద్ధ త్రిత్వపు ఆలయ మూడవ వార్షికోత్సవం సందర్భంగా సిఎస్ఐ చర్చి ఆధ్వర్యంలో నిర్వహించిన ఎద్దుల బలప్రదర్శన పోటీలను శ్రీశైలం నియోజకవర్గం వైసిపి యువ నాయకులు కార్తీక్ రెడ్డి, శ్రీశైలం నియోజకవర్గం వైసిపి సమన్వయకర్త మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వైకాపా రాష్ట్ర మహిళా విభాగం కార్యదర్శి శశికళ రెడ్డి, మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు దేరేరెడ్డి చిన్న సంజీవరెడ్డి, జెసిఎస్ కన్వీనర్ గుడిమల పుల్లారెడ్డి, మాజీ మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు దేశ వెంకట్రామిరెడ్డి, సర్పంచ్ సన్నాల రాధమ్మ, శ్రీనివాసులు దంపతులు ఎంపిటీసీ కొర్రపోలు అర్జున్ శిల్పా కార్తీక్ రెడ్డికి ఘన స్వాగతం పలికారు. అనంతరం పూలమాలలు శాలువాలతో సత్కరించి అనంతరం పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా శిల్పా కార్తీక్ రెడ్డి మాట్లాడుతూ రైతుల పండుగ ఎద్దుల బలపరచిన పోటీలు శ్రీశైలం నియోజకవర్గంలో ఎక్కడ ఎవరు ఏర్పాటు చేసుకున్న ప్రథమ బహుమతి తన తండ్రి ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. రైతులను ప్రోత్సహించి రైతు సంబరాల్లో పాల్గొనడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జై లింగాపురం వైకాపా నాయకులు జిన్ను కృష్ణారెడ్డి, మీసాల సుబ్బారెడ్డి, నరసింహారెడ్డి, వెంకట్ రెడ్డి గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

ఎద్దుల బల ప్రదర్శన పోటీల్లో విజేతలు : వీరంబుల్స్ బీరం సుబ్రహ్మణ్యేశ్వర రెడ్డి, బుల్స్ బీరం సుబ్రహ్మణ్యేశ్వర రెడ్డి, మార్తల వెంకటసుబ్బారెడ్డి, శాకం బ్రహ్మానంద రెడ్డి, ఎం అనన్య రెడ్డి విజేతలుగా నిలిచినట్లు నిర్వాహకులు కురుపులు అర్జున్ సన్నాల శ్రీనివాసులు సీఎస్ఐ చర్చ్ కమిటీ సభ్యులు తెలిపారు.

14న టోల్ ప్లాజాలో ఉచిత మెగా వైద్య శిబిరం

ప్రజాశక్తి - చాగలమర్రి

చాగలమర్రి మండలం నగల్లపాడు సమీపంలోని టోల్ ప్లాజాలో ఈనెల 14వ తేదీన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ప్రాజెక్టు హెడ్ మదన్మోహన్, మేనేజర్ అరుణ్రాజ్, ప్లాజా మేనేజర్ పర్దీక్ మాలిక్, మేనేజర్ యాకూబ్‌లు మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 35వ జాతీయ రహదారి భద్రత మహోత్సవాలలో భాగంగా ఈ మెగా ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నామన్నారు. కర్నూలు అమీలియా ఆసుపత్రి వారి సౌజన్యంతో టుడీ ఈకో,ఈసీజీ, ఆర్ బి ఎస్, కంటి పరీక్షలు తదితర వాటికి వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను ఉచితంగా అందజేస్తామన్నారు. ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

జమ్ములమ్మ ఆలయ నిర్మాణానికి విరాళం

ప్రజాశక్తి - పాములపాడు

జూటూరు గ్రామంలో జమ్ములమ్మ నూతన గుడి నిర్మాణానికి వేంపెంట సొసైటీ చైర్మన్ మచ్చ వెంకట స్వామి, వైసిపి జెసిఎస్ మండల ఇన్చార్జి టి.నాగరాజులు రూ.20 వేలు విరాళంగా మంగళవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి యువజన విభాగ మండల అధ్యక్షుడు బత్తిని చరణ్ కుమార్, గ్రామ పెద్దలు మనోహర్ చిన్న ఈశ్వరయ్య, మౌలాలి, చిన్న మద్దిలేటి, వెంకటరమణ, పాల్గొన్నారు.

విరాళం అందజేస్తున్న నేతలు

డాక్యుమెంట్స్ పోయినవి

నంద్యాల మండలం కానాల గ్రామానికి చెందిన పడకండ్ల, దుర్గమ్మ (W/o. పడకండ్ల విజయుడు) కానాల గ్రామం నుండి నంద్యాలకు ఆటోలో ప్రయాణిస్తుండగా విలువైన డాక్యుమెంట్స్ బేరింగ్ నం. 1058/2023, సర్వే నం. 224/2 కలిగిన బ్యాగు ఎక్కడో పడిపోయింది. బ్యాగు ఎవరికైనా దొరికినట్లయితే దయచేసి ఈ క్రింది మొబైల్ నెంబరుకు ఫోన్ చేసి తెలుపగలరు. 8096035049 (కానాల గ్రామం, డోర్ నెంబర్ :5-47, నంద్యాల మండలం & జిల్లా)